ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
కాకినాడ
జిల్లా వార్తలు
బుధవారం 16 జూలై 2025 | 3





కాకినాడలోని వర్మ నివాసంలో ఇన్‌చార్జి మంత్రి నారాయణతో భేటీ అయిన ఎమ్మెల్యేలు, నేతలు



పెద్దాపురంలో సుపరిపాలన తొలిఅడుగులో కరపత్రాన్ని పంపిణీ చేస్తున్న మంత్రి నారాయణ

ఎన్నికల మేనిఫెస్టోలో హామీలన్నీ అమలు చేస్తాం

సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమంలో మంత్రి నారాయణ

పెద్దాపురం, జూలై 15(ఆంధ్రజ్యోతి): ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను తూచా తప్పకుండా అమలు చేస్తామని పట్టణాభివృద్ధి, పురపాలకశాఖ మంత్రి పి.నారాయణఅన్నారు. జిల్లాలోని జగ్గంపేట, పెద్దాపురం, సామర్లకోటల్లో మంగళవారం సుపరిపాలన తొలిఅడుగు కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. పెద్దాపురం పట్టణంలో ఎమ్మెల్యే చినరాజప్పతో కలిసి పాల్గొన్నారు. ఇంటింటికీ తిరుగుతూ కరపత్రాలను పంచుతూ కూటమి ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి,సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వం చేసిన అవకతవకల కారణంగా రాష్ట్రం మొత్తం చిన్నాభిన్నమైందని, రూ.10లక్షలకోట్ల మేర అప్పు చేసిందని అన్నారు. ప్రజలు కట్టే పన్నులన్నీ వడ్డీలు కట్టడానికే సరిపోతోందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఉన్న అపారమైన అనుభవంతో రాష్ట్రాన్ని ముందుకు నడిపిస్తున్నారన్నారు. పింఛన్‌దారులకు ఒకటో తేదీనే పింఛన్ డబ్బులు అందిస్తున్నామన్నారు. మహిళలకు మూడు ఉచిత గ్యాస్‌సిలెండర్లు, తల్లికి వందనం పథకం ద్వారా 67లక్షలమందికి రూ.పదివేల కోట్ల మేర వారి ఖాతాల్లో జమచేశామన్నారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్‌కుమార్, ఎమ్మెల్యే తనయుడు నిమ్మ కాయల రంగనాగ్, రాజాసూరిబాబురాజు, అరీఫ్ ఆలీ తదితరులు పాల్గొన్నారు.

మంత్రి నారాయణతో టీడీపీ నేతల భేటీ

కాకినాడ సిటీ, జూలై 15 (ఆంధ్రజ్యోతి): కాకినాడలో టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎస్వీఎస్ఎన్ వర్మ నివాసంలో మంగళవారం సాయంత్రం జిల్లా ఇన్‌చార్జి మంత్రి నారాయణతో ఎమ్మెల్యేలు, టీడీపీ నేతలు భేటీ అయ్యారు. పలు అంశాలపై చర్చించారు. ఏడాది పాలనపై తొలి అడుగు కార్యక్రమంలో ఎమ్మెల్యేలు, ఇన్‌చార్జిలు నియోజకవర్గాల్లో పర్యటనలో ప్రజల స్పందనపై చర్చించారు. ఈ సందర్భంగా జిల్లాలో పార్టీ పరిస్థితిపై చర్చించారు. వైసీపీ తీరుపై ఎమ్మెల్యేలు, ఇన్‌చార్జిలు గట్టిగా స్పందించాలని నిర్ణయించారు. సమావేశంలో టీడీపీ జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్, పెద్దాపురం ఎమ్మెల్యే చినరాజప్ప, జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ, ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ, కాకినాడ రూరల్ మాజీ ఎమ్మెల్యే పిల్లి అనంతలక్ష్మి సత్యనారాయణ, టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి వాసిరెడ్డి ఏసుదాసు, కాకినాడ రూరల్ కోకన్వీనర్ కటకంశెట్టి బాబి, ఉభయగోదావరి జిల్లాల గ్రాడ్యుయేట్స్ ఎమ్మెల్సీ పేరాబత్తు రాజశేఖరం పాల్గొన్నారు. మాజీ ఎమ్మెల్యే ఎస్వీఎస్ఎన్ వర్మ ఆధ్వర్యంలో పిఠాపురం నేతలతో ఇన్‌చార్జి మంత్రి నారాయణ కొద్దిసేపు భేటీ అయ్యారు.





ఫీజులుం!

ఫీజు బకాయి కట్టండి.. సర్టిఫికెట్లు పట్టుకెళ్లండి..

- కాలేజీ యాజమాన్యాల పట్టు
- ఇంజనీరింగ్ విద్యార్థుల ఇక్కట్లు
- రూ.1140 కోట్ల ఫీజు బాకీలు
- ఉద్యోగాలకు ప్రయత్నాలు
- సర్టిఫికెట్లు ఇవ్వడానికి ససేమిరా
- బాకీలు చెల్లించాలని డిమాండ్
- జమకాని ఫీజు రీయింబర్స్‌మెంట్

(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

గత వైసీపీ ప్రభుత్వం విద్యార్థులను నిండా ముంచేసింది. నాడు ఫీజులు చెల్లించకుండా ముప్పుతిప్పలు పెట్టింది. ఆ పాపం ప్రస్తుత ప్రభుత్వానికి చుట్టుకుంది. దీంతో సుమారు ఒక్క ఇంజనీరింగ్ కాలేజీలకే సుమారు వెయ్యి కోట్ల వరకూ ఫీజు బకాయిలు ఉన్నట్టు సమాచారం. ఈ నేపథ్యంలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో వేలాది మంది ఇంజనీరింగ్ విద్యా ర్థులకు కాలేజీలు చుక్కలు చూపిస్తున్నాయి. చదువు పూర్తి చేసుకున్న విద్యార్థులకు సర్టిఫికెట్లు ఇవ్వకుండా ఇబ్బంది పెడుతున్నాయి. ఫీజు బకాయి చెల్లించేవరకు వాటిని ఇవ్వబోమంటూ సతాయిస్తున్నాయి. సకాలంలో తమ సర్టిఫికెట్లను కంపెనీలు, ఇతర విద్యాసంస్థలకు ఇవ్వకపోతే అవకాశాలు పోతాయని మొత్తుకుంటున్నారు. అటు కాలేజీ యాజమాన్యాలేమో తమకు ప్రభుత్వం నుంచి ఫీజు బకాయిలు రాకపోవడంతో విద్యార్థులే చెల్లించాలని తెగేసి చెబుతున్నాయి. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు రూ.540 కోట్ల వరకు ఉన్నాయి. ఇది కాకుండా గత వైసీపీ హయాంలో 600 కోట్లు వరకూ బాకీలు ఉండడం గమనార్హం.

బకాయిలు..ముప్పుతిప్పలు

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో కాకినాడ జేఎన్టీయూ పరిధిలో మొత్తం 28 వరకు ఇంజనీరింగ్ కాలేజీలున్నాయి. ఇందులో పది కాలేజీలు ఒక్క కాకినాడ జిల్లాలోనే ఉన్నాయి. మిగిలిన 18 కాలేజీలు కోనసీమ, తూర్పుగోదావరి జిల్లాల్లో ఉన్నాయి. మొత్తం 28 కాలేజీల్లో ఇంజనీరింగ్ పూర్తిచేసుకున్న విద్యార్థులు 12 వేల మంది ఉన్నారు. విద్యార్థుల్లో అనేక మందికి క్యాంపస్ ప్లేస్‌మెంట్లు, ఆన్‌లైన్ ఇంటర్వ్యూల ద్వారా ఉద్యోగాలు లభించాయి. కొందరేమో ఉన్నత చదువులకు వెళుతున్నారు. ఈ నేపథ్యంలో సర్టిఫికెట్లు ఉండాలి. తీరా ఇప్పుడు ఇంజనీరింగ్ చదివిన కాలేజీలు వీటిని ఇవ్వ కుండా ఇబ్బంది పెడుతుండడంతో లబోదిబో మంటున్నారు. కాలేజీల యాజమాన్యాలు సర్టిఫికెట్లు ఇవ్వొద్దని తెగేసి చెప్పేయడంతో ఎంత బతిమాలినా సిబ్బంది వీటిని ఇవ్వడం లేదు. దీంతో కొందరు అత్యవసరం అనుకున్న విద్యార్థులు అప్పులుచేసి ఫీజులు కడుతున్నారు. లేదంటే ఉద్యోగం పోతుందనే భయంతో బాకీలు చెల్లిస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించాల్సి ఉంది.

రూ.1140 కోట్లుపైనే..

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఇంజనీరింగ్ కాలేజీలకు ఫీజు రీయింబర్స్‌మెంట్ బాకీలు రూ.వెయ్యి కోట్ల వరకు పేరుకుపోయాయి.గత వైసీపీ హయాంలో రూ.600 కోట్ల వరకూ ఉన్నాయి.. ప్రస్తుత ప్రభుత్వంలో రూ.540 కోట్లు బకాయి ఉంది. దీంతో సర్టిఫికెట్లు ఆపి విద్యార్థుల నుంచి బాకీలు కట్టించుకోవాల్సి వస్తుందని యాజమాన్యాలు అధికారులకు సంజాయిషీ ఇస్తున్నాయి.ప్రధానంగా కాకినాడ జిల్లా మెట్టప్రాంతంలో ఉన్న ఓ ప్రముఖ ఇంజనీరింగ్ కాలేజీకి ఫీజు రీయిం బర్స్‌మెంట్ బాకీలు సెకండ్ ఇయర్ నుంచి ఫైనలియర్ విద్యార్థులవి కలిపి రూ.90 కోట్ల వరకు వసూలు కావాల్సి ఉంది. దానికి సమీపంలో ఉన్న మరో కాలేజీకి రూ.15కోట్ల వరకు పేరుకుపోయాయి.ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఆరు భారీ ఇంజనీరింగ్ కాలేజీల బకాయిలే రూ.240 కోట్ల వరకు ఉన్నాయి. ఇవికాక మధ్యస్తంలో ఉండే పది కాలేజీల బకాయిలు రూ.150 కోట్లు, మిగిలిన మరో పది కాలేజీల బకాయిలు రూ.60 కోట్ల వరకు ఉన్నాయని ఆయా యాజమాన్యాలు వివరిస్తున్నాయి.

విద్యార్థుల జీవితాలతో ఆటలు

విద్యార్థుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని కొన్ని కాలేజీలు తమ బకాయిలకు రాజధానిలో ఉన్న తాధికారులతో మాట్లాడుతున్నా స్పందన ఉండడం లేదు. పోనీ బాకీలు వేగంగా వస్తే సర్టిఫికెట్లు ఇవ్వాలని భావిస్తున్నా అది జరగడం లేదు. మరోపక్క బాకీలు రాకుండా సర్టిఫికెట్లు ఇచ్చేస్తే నష్టపోతామని భావిస్తున్నాయి. ప్రభుత్వం మారాక ఒక వాయిదా బాకీలు కాలేజీలకు అందాయి. ఇంకా మిగిలినవి రావాల్సి ఉందని చెబుతున్నాయి.అయితే ఫైనలియర్ విద్యార్థులు నాలుగు నుంచి ఐదు వాయిదాల వరకు బాకీలు చెల్లించాల్సి ఉందని చెబుతున్నాయి. దీంతో ఇప్పుడు ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఇంజనీరింగ్ పూర్తిచేసుకున్న విద్యార్థులు సర్టిఫికెట్ల కోసం నానాపాట్లు పడుతున్నారు. కొందరైతే ప్రభుత్వం నుంచి రావాల్సిన రీయంబర్స్‌మెంట్ డబ్బులు మినహా మిగిలినవన్నీ చెల్లిస్తామని కాలేజీలను ప్రాథేయపడుతున్నాయి. కానీ యాజమాన్యాలు మాత్రం ససేమిరా అంటున్నాయి. దీంతో ఏం చేయాలో తెలియక విద్యార్థులు తలలు పట్టుకున్నారు. ఇంతకాలం ఎంతో కష్టపడి చదివి చివరిలో ఇదేంటిరా అంటూ తలలు బాదుకుంటున్నారు. కొన్ని కాలేజీలైతే మరీ దారుణంగా క్యాంపస్ ప్లేస్‌మెంట్లకు ఎంపికైన విద్యార్థులను సైతం బకాయిల పేరుతో వేధిస్తుండడంతో వారంతా కన్నీటి పర్యంతమవుతున్నారు. వాస్తవానికి గత వైసీపీ హయాంలో ఫీజు రీయింబర్స్‌మెంట్ డబ్బులను తల్లుల ఖాతాల్లో జమ చేసేవారు. ప్రభుత్వం మారాక నేరుగా కాలేజీల ఖాతాల్లోనే జమవుతున్నాయి.



తంతి తపాలా.. కళ కళ!

- భారీగా పెరిగిన ఖాతాదారులు
- ప్రభుత్వ పథకాల అనుసంధానంతో బారులు తీరుతున్న లబ్ధిదారులు

(కాకినాడ - ఆంధ్రజ్యోతి)

కొన్ని నెలల కిందట వరకు ఆ శాఖ కార్యాలయం వెలవెలబోయేది. ఉత్తరప్రత్యుత్తరాలకే పరిమితమైన ఆ సంస్థ మళ్లీ జనంతో కిటకిటలాడుతోంది. నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(ఎన్‌పీసీఐ)తో అనుసంధానమైన పోస్టల్ పేమెంట్ బ్యాంకు ఖాతా(ఐపీబీ)లను తెరిచేందుకు జనం బారులుదీరుతున్నారు. సెల్‌ఫోన్‌లు, ఇంటర్నెట్లు లేని కాలంలో ప్రజలకు సమాచారాన్ని చేరవేయడంలో కీలక పాత్ర పోషించింది తపాలాశాఖే. తర్వాత కంప్యూటర్లు, ఇంటర్నెట్ అందుబాటులోకి రావడంతో మెయిల్స్ ద్వారా సమాచారాన్ని పంపేవారు. నేడు సాంకేతిక పరిజ్ఞానం కొత్తపుంతలు తొక్కడం, సెల్‌ఫోన్‌లు అందుబాటులో రావడం, ప్రైవేటు కొరియర్ సంస్థలు అందుబాటులోకి రావడంతో తపాలాశాఖ సేవలను వినియోగించే వారు కాస్త తగ్గారు. కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు తపాలాశాఖకు పూర్వ వైభవాన్ని తెస్తున్నాయి. తల్లికివందనం, త్వరలో అమలుకానున్న అన్నదాతా సుఖీభవ పథకాల నగదును ప్రభుత్వం నేరుగా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలకు జమచేస్తోంది. ఈ మొత్తం జమకావాలంటే వారి ఖాతాలు తప్పనిసరిగా నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(ఎన్‌పీసీఐ)తో అనుసంధానమై ఉండాలి. చాలామంది ఖాతాలు ఎన్‌పీసీఐతో అనుసంధానం కాకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ విషయాన్ని గుర్తించిన తపాలాశాఖ అధికారులు ఎన్‌పీసీఐతో అనుసంధానమైన పోస్టల్ పేమెంట్ బ్యాంక్ ఖాతా(ఐపీపీబీ)లను తెరిపిస్తున్నారు. ఇందుకోసం ప్రత్యేక డ్రైవ్ చేపట్టారు. దీంతో సంక్షేమ పథకాల లబ్ధిదారులు పెద్ద సంఖ్యలో తపాలా ఖాతాలు తెరిచేందుకు ఆసక్తి చూపుతున్నారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో కాకినాడ, రాజమండ్రి, అమలాపురం, రామచంద్రపురం, సామర్లకోటలలో ప్రధాన తపాలా కార్యాలయాలు ఉన్నాయి. అలాగే ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 154 సబ్ పోస్టాఫీసులు, 787 బ్రాంచి పోస్టాఫీసులు ఉన్నాయి. వీటి పరిధిలో ఆరు నెలల కాలంలో సుమారు 30-40 వేలకుపైగా ఖాతాలు తెరిచినట్టుగా అధికారిక లెక్కలు చెబుతున్నాయి. లబ్ధిదారుల ఇళ్ల వద్దకు, కళాశాల వద్దకు వెళ్లి ఖాతాలు తెరిపిస్తున్నారు. ఖాతాదారులకు ఏటీఎం కార్డు, పాసు పుస్తకం ఇస్తున్నారు. వీటి ద్వారా నగదు లావాదేవీలు నిర్వహించుకోవచ్చు.

తరలివస్తున్న లబ్ధిదారులు

ఉమ్మడి తూర్పుగోదారి జిల్లాలోని కాకినాడ డివిజన్‌లో 5.53 లక్షలు, రాజమహేంద్రవరంలో 3.40 లక్షల ఐపీపీబీ ఖాతాలు ఉన్నాయి. తల్లికి వందనం పథకం కింద ఉమ్మడి జిల్లాలోని 5,53,767 మంది తల్లుల ఖాతాల్లో ఇప్పటి వరకు రూ.82 కోట్ల నగదు జమైంది. చాలామంది బ్యాంకు ఖాతాలు ఎన్‌పీసీఐకి అనుసంధానం కాలేదు. దీంతో వాటి వివరాలు లేకపోవడంతో తల్లికి వందనం డబ్బులు జమకాలేదు. వారందరూ ప్రస్తుతం తపాలా ఖాతాలు తెరిచేందుకు ముందుకొస్తున్నారు. రోజూ వేలాదిమంది ఖాతాలు తెరిచేందుకు బారులుతీరుతున్నారు.

అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నాం

ప్రభుత్వ పథకాల నగదు బ్యాంకు ఖాతాలో జమకావాలంటే నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియాతో అనుసంధానం కావాలి. ఈ విషయం తెలుసుకుని చాలామంది తపాలాశాఖలో ఖాతాలు తెరిచేందుకు తరలివస్తున్నారు. వారిని దృష్టిలో పెట్టుకుని అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నాం. **- డీఎస్‌యూ నాగేశ్వర్ రెడ్డి, సూపరింటెండెంట్, కాకినాడ**

కార్పొరేట్‌కు దీటుగా
జీజీహెచ్ అభివృద్ధికి చర్యలు

కలెక్టర్ షాన్‌మోహన్



అత్యాధునిక వైద్య పరికరాలను ప్రారంభిస్తున్న కలెక్టర్

జీజీహెచ్(కాకినాడ),జూలై15(ఆంధ్రజ్యోతి): కాకినాడ జీజీహెచ్‌ను కార్పొరేట్‌కు దీటుగా మరింత మెరుగైన వైద్యసేవలందించేలా అభివృద్ధి చేసేందుకు చర్యలు చేపడతామని కలెక్టర్ షాన్‌మోహన్ అన్నారు. కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ(సీఎస్ఆర్)లో భాగంగా ఓఎన్‌జీసీ, యూనివర్సిటీ ఆఫ్ బయోఫ్యూయల్స్ ప్రైవేటు లిమిటెడ్, జెమిని ఎడిబుల్ ఆయిల్స్ లిమిటెడ్ పరిశ్రమలకు సంబంధించి సమకూర్చిన రూ.78.77లక్షల సీఎస్ఆర్ నిధులతో అత్యంత అధునాతనమైన వైద్యపరికరాలు, ఆధునికీకరించిన పనులను మంగళవారం కలెక్టర్ షాన్‌మోహన్, ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ ప్రారంభించారు. ఆస్పత్రి ట్రామాకేర్ విభాగంలోని న్యూరాలజీ, పల్మనాలజీ, అన స్థీషియా, కార్డియాక్ విభాగాలకు సంబంధించిన వైద్యపరికరాలను ప్రారంభించారు. అనంతరం న్యూరో ఓపీ షెడ్‌ను కలెక్టర్, ఎమ్మెల్సీ కలిసి ప్రారంభించారు. అనంతరం ఆర్థోపెడిక్ ఓపీ విభాగం వద్ద ఏర్పాటు చేసిన ప్రివెంటివ్ ఆంకాలజీ షెడ్‌ను ప్రారంభించారు. తదుపరి ఆధునికీకరించిన బ్లడ్ శ్యాంపుల్ కలెక్షన్ ఓపీ షెడ్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వేల మంది రోగులకు ఉచితంగా సేవలందిస్తున్న కాకినాడ జీజీహెచ్ మరింత బలోపేతం కావాలంటే ఇటువంటి అభివృద్ధి పనులతోనే సాధ్యమన్నారు. కాకినాడ జీజీహెచ్ రాష్ట్రంలోనే అగ్రస్థానంతో నిలబడాలనేది మనందరి ఆకాంక్ష అన్నారు. ఎమ్మెల్సీ పద్మశ్రీ మాట్లాడుతూ ప్రముఖ సంస్థలు సీఎస్ఆర్ నిధులతో సమకూర్చిన న్యూరాలజీ, పల్మనాలజీ, ప్రివెంటివ్ ఆంకాలజీ విభాగాల్లో అత్యాధునిక వైద్యపరికరాల కొనుగోలుకు ఓఎన్‌జీసీ సంస్థ రూ.50లక్షలు ఖర్చు చేసిందన్నారు. ఓసీ షెడ్ పునరుద్ధరణకు, న్యూరో ఓపీ షెడ్ నిర్మాణానికి యూనివర్సిటీ ఆఫ్ బయోఫ్యూయల్స్ ప్రైవేటు లిమిటెడ్, రూ.16.85లక్షలు, ప్రివెంటివ్ అంకాలజీ షెడ్ నిర్మాణానికి జెమిని ఎడిబుల్ ఆయిల్స్ లిమిటెడ్ రూ.ఒక లక్ష మొత్తంగా రూ.78.77లక్షలతో అభివృద్ధి పనులు చేపట్టినట్లు తెలిపారు. సీఎస్ఆర్ నిధులను సమకూర్చడంలో కలెక్టర్ షాన్‌మోహన్ తీసుకున్న ప్రత్యేక శ్రద్ధ అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఆర్ఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.విష్ణువర్ధన్, జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎస్.లావణ్యకుమారి, డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ పద్మనాభన్ శ్రీనివాసన్, ఓఎన్‌జీసీ జీఎంహెచ్ఆర్ కె.సునీల్‌కుమార్, సీపీవో పి.త్రినాథ్, ఏపీఎస్ఎంఐడీసీ ఈఈసీహెచ్ రత్నరాజు, అడ్మినిస్ట్రేటర్ శ్రీధర్, ఏవో టి.శేషేంద్రశర్మ పాల్గొన్నారు.

జేఎన్టీయూకేలో నేడు.. 4
యూసీఈకే ఓక్ ఉత్సవాలు

రెడ్‌క్రాస్ సేవలు జిల్లాకు గర్వకారణం

కలెక్టర్ షాన్‌మోహన్



మూడేళ్ల పురస్కారాలతో రెడ్‌క్రాస్ సంస్థ చైర్మన్ వైడీఆర్, కలెక్టర్

కార్పొరేషన్(కాకినాడ), జూలై 15(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అత్యుత్తమ రెడ్‌క్రాస్ జిల్లా శాఖగా మరొకసారి పురస్కారాలు పొందడం మన జిల్లాకు గర్వకారణమని రెడ్‌క్రాస్ జిల్లా అధ్యక్షులు, కలెక్టర్ షాన్ మోహన్ హర్షం వ్యక్తం చేశారు. ఇటీవల ఆంధ్రప్రదేశ్ రెడ్‌క్రాస్‌శాఖ అధ్యక్షుడు, గవర్నర్ అబ్దుల్ నజీర్ నుంచి రాష్ట్రస్థాయిలో 2021-22 నుంచి 2023-24 వరకు వరుసగా మూడేళ్ల అత్యుత్తమ జిల్లాశాఖగా కాకినాడ జిల్లా మొదటి స్థానాన్ని గెలుచుకోగా సదరు పురస్కారాలను సంస్థ చైర్మన్ వైడీ రామారావు, కోశాధికారి ఎన్‌వీవీ ఆర్‌కే ప్రసాద్‌బాబు, కార్యదర్శి కె.శివకుమార్ మంగళవారం కలెక్టర్‌కు అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఉత్తమ జిల్లా శాఖ అవార్డులు ఏర్పాటు చేసినప్పటి నుంచి వరుసగా ఏడుసార్లు మన జిల్లా శాఖ రాష్ట్రంలో ప్రథమ స్థానంలో నిలబడడం మన జిల్లాకు గర్వకారణమని, మన జిల్లా శాఖ చేస్తున్న వివిధ సేవా కార్యక్రమాలు ప్రజల మన్ననలు పొందాయని హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా చైర్మన్ రామారావు మాట్లాడుతూ భవిష్యత్తులో మరిన్ని నూతన సేవా కార్యక్రమాల ద్వారా రెడ్‌క్రాస్ ప్రతిష్టను ఇనుమడింప చేయడానికి కృషిచేస్తామని తెలిపారు. ఇటీవల రెడ్‌క్రాస్‌కు సేవలు అందించి గవర్నర్ ద్వారా పురస్కారాలు అందుకున్న ఓఎన్జీసీ, కేఎస్‌పీఎల్ ప్రతినిధులతోపాటు పలువురికి కలెక్టర్ శుభాకాంక్షలు తెలిపారు.

జీజీహెచ్‌లో డిప్యూటీ సీఎం ఫొటో ఏది?

పవన్‌కల్యాణ్ ఫొటో లేకుండానే 13 నెలలుగా పాలన

జీజీహెచ్(కాకినాడ), జూలై 15(ఆంధ్రజ్యోతి): కాకినాడ జీజీహెచ్‌లో డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ఫొటోలేదు. జీజీహెచ్ ఉన్నతాధికారి సూపరింటెండెంట్ కార్యాలయంలో ముఖ్యమంత్రితోపాటు ఉప ముఖ్యమంత్రి ఫొటో ఉండాల్సి ఉంది. కానీ, ముఖ్యమంత్రి చంద్రబాబు ఫొటోతో సరిపెట్టి ఉపముఖ్యమంత్రి ఫొటో ఏర్పాటులో సూపరింటెండెంట్ లావణ్యకుమారి ఆధ్వర్యంలో అధికారులు అలక్ష్యం వహించారు. కొద్దిరోజుల క్రితం జనసేన నేతలు ఓ పనిపై సూపరింటెండెంట్ వద్దకు వెళ్లగా వారు దీన్ని గ్రహించారు. అప్పటికప్పుడే డాక్టర్ లావణ్యకుమారిని దీనిపై ఆరా తీస్తే పెడతామంటూ ఆమె సర్దిచెప్పారు. డిప్యూటీ సీఎంగా పవన్‌కల్యాణ్ బాధ్యతలు స్వీకరించి 13 నెలలు గడుస్తున్నాయి. నేరుగా సీఎం చంద్రబాబు నాయుడే ప్రతి ప్రభుత్వ కార్యాలయంలో ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఫొటో ఉండాలని ఆదేశించినా జీజీహెచ్‌లో అధికారుల చెవికి ఎక్కలేదు. తాజాగా జనసేన నేతలు నిలదీయడంతో పొరపాటును సరిదిద్దుకుంటారని భావించినా చలనం లేదన్న విమర్శ వినిపిస్తోంది.

సుస్థిరాభివృద్ధి లక్ష్యాల కోసం ఎంపీడీవోల ఎంపిక

ప్రత్తిపాడు, జూలై 15 (ఆంధ్రజ్యోతి): స్థానిక సుస్థిరాభివృద్ధి లక్ష్యాలు అమలుకు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలకు చెందిన ముగ్గురు ఎంపీడీవోలు ఎంపికయ్యారు. కాకినాడ జిల్లా నుంచి ప్రత్తిపాడు ఎంపీడీవో ఎంవీఆర్ కుమార్‌బాబు, డాక్టర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా నుంచి కె.గంగవరం ఎంపీడీవో పీవీ శ్రీనివాసరావు, తూర్పుగోదావరి జిల్లా నుంచి సీతానగరం ఎంపీడీవో ఎం.భారతి ఎంపికయ్యారు. వీరు విజయవాడ కానూరులోని ఏపీఎస్ఐఆర్‌డీలో మూడురోజులు శిక్షణ పొందనున్నారు.



కాకినాడలో ఓ కళాశాల వద్ద డ్రోన్‌తో నిఘా పెట్టిన దృశ్యం

డ్రోన్ చూస్తుంది.. జాగ్రత్త!

జిల్లావ్యాప్తంగా విద్యాసంస్థల వద్ద డ్రోన్‌లతో నిఘా

కాకినాడ క్రైం, జూలై 15(ఆంధ్రజ్యోతి): పాఠశాలలు, కళాశాలల వద్ద ఈవ్‌టీజింగ్, ర్యాగింగ్ వంటివి నిరోధించే దిశగా ఎస్పీ జి.బిందుమాధవ్ ఆదేశాలతో పోలీసులు డ్రోన్స్‌తో నిఘాను పటిష్టం చేశారు. జిల్లావ్యాప్తంగా అన్ని మున్సిపాలిటీ, నగరపాలక పాఠశాలలు, ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలలవద్ద ప్రతిరోజూ విద్యార్థినులు వచ్చి, పోయే సమయాల్లో డ్రోన్లతో ప్రత్యేక నిఘా చర్యలు కొనసాగిస్తున్నారు. డ్రోన్ కెమెరాల ద్వారా అనుమానితులను గుర్తించడం, విద్యార్థినుల్లో భద్రతా భావాన్ని పెంపొందించడమే లక్ష్యంగా, శాంతి భద్రతల పరిరక్షణకు డ్రోన్లను వినియోగిస్తున్నట్లు ఎస్పీ తెలిపారు. ఈ చర్యల ద్వారా విద్యార్థినుల తల్లిదండ్రులకు, విద్యాసంస్థల యాజమాన్యానికి సంపూర్ణ భరోసా కలుగుతుందన్నారు.

ఉప్పాడలో కోత నివారణకు శాశ్వత పరిష్కారం

ఎంపీ ఉదయ్ శ్రీనివాస్

కలెక్టరేట్(కాకినాడ), జూలై 15(ఆంధ్రజ్యోతి): కాకినాడ పార్లమెంటు పరిధిలో ఉన్న ఉప్పాడ తీర ప్రాంత కోత నివారణకు త్వరలోనే శాశ్వత పరిష్కారం లభించనుందని కాకినాడ ఎంపీ ఉదయ్‌శ్రీనివాస్ తెలిపారు. ఈమేరకు మంగళవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. తీర ప్రాంత కోతనివారణకు రూ.323కోట్ల వ్యయంతో శాశ్వత ప్రాతిపదికన రక్షణ గోడ నిర్మించేందుకు కేంద్రం సుముఖత వ్యక్తం చేసినట్లు వెల్లడించారు. సముద్ర అలల కారణంగా ఉప్పాడ తీరప్రాంతం క్రమేణ క్షీణించిపోతోందన్నారు. మూడు దశాబ్దాలుగా ప్రతిఏటా సగటున 1.23మీటర్ల మేరకు కోతకు గురవుతుందన్నారు. దీంతో తీరప్రాంత గ్రామాలైన ఉప్పాడ, నేమాం, అమీనాబాద్, సుబ్బంపేట, కొమరగిరిల్లో మత్స్యకారుల జీవనోపాధిపై తీవ్రంగా ప్రభావం చూపుతోందన్నారు. తీరప్రాంత కోత నివారణకు శాశ్వత పరిష్కారం కోసం డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ సూచనలతో కేంద్ర హోంశాఖ ప్రతినిధులతో చర్చించడంతోపాటు నేషనల్‌డిజాస్టర్ మేనేజ్‌మెంట్ అథారిటీకి లేఖ రాశారన్నారు. ఈ ప్రతిపాదనను ఆమోదానికి 30న న్యూఢిల్లీలో సబ్‌కమిటీ సమావేశం కానుందన్నారు.

నేడు కలెక్టరేట్‌లో జిల్లా అభివృద్ధి సమీక్షా సమావేశం

కలెక్టరేట్(కాకినాడ), జూలై 15(ఆంధ్రజ్యోతి): కాకినాడ కలెక్టరేట్‌లో బుధవారం ఉదయం 11గంటలకు జిల్లా అభివృద్ధి సమీక్షా సమావేశం(డీఆర్‌సీ) నిర్వహించనున్నారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రి పి.నారాయణ అధ్యక్షతన సమావేశం జరుగుతుంది. దీనిలో జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్‌తో పాటు అధికారులు పాల్గొంటారు. జిల్లా ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పాల్గొని వివిధ ప్రభుత్వ పథకాలు లబ్ధిదారులకు చేరుతున్న తీరుపై ప్రత్యేకంగా సమీక్షిస్తారు. సమావేశం నిర్వహించడానికి అధికారులు తగిన ఏర్పాట్లు చేశారు.





వెలుగుల 'సన్'తోషం!

విద్యుత్ వినియోగదారులను కరెంటు బిల్లులు షాక్ కొడుతున్నాయి. జేబులను గుల్లచేస్తున్నాయి. నెలనెలా బిల్లులు చెల్లించేందుకు నానా ఇబ్బందులు పడేవారి సంఖ్య కూడా పెరిగింది. ఈ నేపథ్యంలో ప్రధానమంత్రి సూర్యఘర్ పథకం విద్యుత్ వినియోగదారులకు ప్రత్యామ్నాయంగా మారింది.

- అదే ప్రధానమంత్రి సూర్యఘర్ పథకం లక్ష్యం
- ఉమ్మడి జిల్లాలో అమలుకు విద్యుత్ శాఖ కసరత్తు
- సబ్సిడీతో సోలార్ ప్యానెళ్ల ఏర్పాటు

(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

అధికంగా విద్యుత్ వినియోగించే వారికోసం కేంద్రం ప్రవేశపెట్టిన పథకమిది. దీనికి అందరూ అర్హులే. 200 యూనిట్లలోపు ఉచిత విద్యుత్ పొందుతున్న ఎస్సీ, ఎస్టీ వినియోగదారులు అందరికీ ఈ సూర్యఘర్ పథకం ద్వారా సోలార్ రూఫ్ టాప్‌లను ప్రభుత్వమే ఏర్పాటు చేయనుంది. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పరిధిలోని విద్యుత్ వినియోగదారులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవడానికి ఆసక్తి చూపిస్తున్నారు. ఉదాహరణకు కాకినాడ జిల్లాలో ప్రస్తుతం 50,801 మంది ఉచిత విద్యుత్ పొందుతున్నారు. వీరిలో 25,275 మంది ఇళ్లకు రూఫ్‌టాప్‌లు ఉన్నాయి. మిగిలిన 25,256 మంది ఇళ్లపై ప్యానళ్ల ఏర్పాటుకు అవకాశం లేకపోవడంతో వీరి కోసం ప్రత్యేకంగా ఆయా గ్రామాల పరిధిలో స్థలాలు ఏర్పాటుచేసి ప్లాంట్లు నెలకొల్పనున్నారు. అందుకోసం సుమారు వంద ఎకరాలు అవసరమని గుర్తించి 80 ఎకరాలు సేకరించారు. అదేవిధంగా స్వచ్ఛందంగా ఈ పథకం కింద సోలార్ కనెక్షన్లు పెట్టుకునేవారి సైతం దరఖాస్తు చేసుకోవచ్చు. గతేడాది ఆగస్టులోనే ఈ పథకానికి శ్రీకారం చుట్టారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ, తూర్పుగోదావరి జిల్లాల్లోనూ వేలాది సోలార్ కనెక్షన్ల ఏర్పాటుకు విద్యుత్ శాఖాధికారులు చర్యలు చేపట్టారు.

లబ్ధిదారులకు మేలు..



సూర్యఘర్ పథకంతో లబ్ధిదారులకు మేలు జరుగుతుంది. విద్యుత్‌చార్జీల నుంచి ఉపశమనం దక్కుతుంది. ఒకకిలోవాట్ సామర్థ్యంతో సోలార్‌ప్యానల్ ఏర్పాటుచేస్తే రోజుకు ఐదు యూనిట్ల విద్యుదుత్పత్తి అవుతుంది. అంటే నెలకు 150 యూనిట్ల విద్యుత్ వినియోగించుకోవచ్చు. రెండు, నుంచి మూడు కిలోవాట్ల యూనిట్లయితే నెలకు 300 యూనిట్ల విద్యుదుత్పత్తి అవుతుంది. గృహ అవసరాలకు 200 యూనిట్లు వాడగా మిగిలింది ప్రభుత్వం కొంటుంది. **-ఉదయభాస్కర్, డీఈ (ఆపరేషన్స్), ఈపీడీసీఎల్, కాకినాడ**

బీసీ, ఓసీ, ఇతర వర్గాలకు..

ఈ రెండు వర్గాలకు సబ్సిడీపై సోలార్ యూనిట్లను ఏర్పాటు చేయనున్నారు. బీసీలకు ఒక కిలో వాట్ యూనిట్‌కి రూ.65 వేల ఖర్చుతో సోలార్ రూఫ్ టాప్ ఏర్పాటుకు ప్రభుత్వం సహకరిస్తోంది. ఇందులో రూ.30 వేల వరకు సబ్సిడీ ఉంటుంది. రెండు కిలో వాట్ యూనిట్‌కి రూ.1.30 లక్షలు ఖర్చయితే రూ.60 వేల వరకు సబ్సిడీ ఉంటుంది. మూడు కిలో వాట్ల యూనిట్‌కు రూ.2లక్షలు ఖర్చవుతుంది. అందులో రూ.75 వేల సబ్సిడీ ఉంటుంది.

ఇదే మంచి త'రుణం'..

పేద కుటుంబాలు ఎవరైనా ఒక కిలోవాట్ సోలార్ రూఫ్‌టాప్ యూనిట్ ఏర్పాటు చేయదలచుకుంటే దానికి కాకినాడ జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ ఒక ఆఫర్ ప్రకటించారు. ఈ యూనిట్ విలువ రూ.65 వేలు. ఇందులో అందులో డ్వామా స్త్రీనిధి ద్వారా రూ.6 వేలు, బ్యాంకు రుణం రూ.59 వేలు ఇస్తారు. రూ.59 వేలులో సబ్సిడీ రూ.30 వేలు ఉంటుంది. అంటే చివరికి చెల్లించాల్సింది రూ.29 వేలు మాత్రమే. దీనిని కూడా వాయిదాల పద్ధతిలో చెల్లించవచ్చు. ఇది ఎస్సీ, బీసీ, ఓసీ అన్ని వర్గాలకు వర్తిస్తుంది.

ఇలా చేస్తున్నారు...

కాకినాడ జిల్లాలో మొత్తం ఏడు లక్షల విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. ఇందులో గృహ విద్యుత్ కనెక్షన్లు ఐదు లక్షల వరకు ఉన్నాయి. కాకినాడ, పెద్దాపురం, జగ్గంపేటల్లో సోలార్ రూఫ్ టాప్‌ల ఏర్పాటుకు 6,792 మంది పేర్లు నమోదు చేసుకున్నారు. 2,200 మంది 6,200 కిలోవాట్ల సామర్థ్యంతో సౌర ఫలకాల ఏర్పాటుకు ముందుకొచ్చారు. వీరిలో 1,776 మంది గృహాలపై 6,140 కిలోవాట్ల మేర ఫలకాలు ఏర్పాటు చేశారు. కాకినాడ డివిజన్‌లో 1,070, పెద్దాపురం డివిజన్‌లో 473, జగ్గంపేట డివిజన్‌లో 233 కనెక్షన్ల ఏర్పాటుకు అధికారులు చర్యలు చేపడుతున్నారు. జిల్లాలో సోలార్ యూనిట్ల ఏర్పాటుకు 40 మంది ప్రైవేటు ఏజెన్సీ టీమ్‌ను అప్పగించారు. ఈ టీమ్ వారికి కేటాయించిన మండలాల్లో ఈ యూనిట్ల ఏర్పాటుకు చర్యలు చేపట్టనుంది. ఒక కిలో వాట్‌కు ఒక రోజుకి ఐదు యూనిట్లు వస్తుంది. నెలకు 150 యూనిట్ల విద్యుత్ వినియోగించుకోవచ్చు. ఒక్కసారి సోలార్ రూఫ్ టాప్‌లను ఏర్పాటు చేసుకుంటే 25 ఏళ్లపాటు వాటి ద్వారా విద్యుత్‌ను ఉత్పత్తి చేసుకోవచ్చని విద్యుత్ శాఖాధికారులు చెబుతున్నారు.

జేఎన్టీయూకేలో నేడు.. యూసీఈకే ఓక్ ఉత్సవాలు

- ముఖ్యఅతిథిగా సౌత్ ఏషియన్ యూనివర్సిటీ అధ్యక్షుడు, ప్రొఫెసర్ అగర్వాల్
- గౌరవ అతిథిగా యూజీసీ మాజీ చైర్మన్ ప్రొఫెసర్ వేద్ ప్రకాష్
- యూసీఈకే 80వ సంవత్సరంలోకి అడుగుపెడుతున్న సందర్భంగా నిర్వహణ



జేఎన్టీయూకేలోని యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్

జేఎన్టీయూకే, జూలై 15 (ఆంధ్రజ్యోతి): జేఎన్టీయూకేలో బుధవారం యూసీఈకే ఓక్ ఉత్సవాలు నిర్వహించనున్నారు. కాకినాడ నగరంలో 1946లో ప్రభుత్వ ఇంజినీరింగ్ కళాశాలను స్థాపించారు. 2025, జూలై 16 నాటికి కళాశాల 79ఏళ్లు పూర్తిచేసుకుని 80వ సంవత్సరంలోకి అడుగుపెడుతున్న సందర్భంగా ఓక్ ఉత్సవాలను నిర్వహిస్తున్నట్లు వర్సిటీ ఇన్‌చార్జి రిజిస్ట్రార్ ఆర్.శ్రీనివాసరావు తెలిపారు. ఈ ఉత్సవాల ద్వారా ప్రజలకు యూసీఈకే కళాశాల ప్రతిష్ఠను తెలియజేయనున్నారు. ఏడాదిపాటు అనగా 2025, జూలై 16 నుంచి 2026, జూలై 15 వరకూ వివిధ కార్యక్రమాలు నిర్వహించడానికి ప్రణాళికను సిద్ధం చేశామన్నారు.

ఓక్ ఉత్సవాలను బుధవారం ప్రారంభించనుండగా ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా న్యూఢిల్లీలోని సౌత్ ఏషియన్ యూనివర్సిటీ అధ్యక్షుడు ప్రొఫెసర్ కేకేఅగర్వాల్ పాల్గొంటున్నారని తెలిపారు. గౌరవ అతిథిగా యూజీసీ మాజీ చైర్మన్ ప్రొఫెసర్ వేద్ ప్రకాష్, ప్రత్యేక అతిథులుగా పూర్వవిద్యార్థులు ఐఐటీమద్రాస్ నుంచి సీఎస్ఈ ప్రొఫెసర్ డి.జానకిరాం, బెంగళూరులోని ఎక్స్ఐఎంఈ పరిశోధనా విభాగం డీన్ ప్రొఫెసర్ ఎస్.ఎం.కే భట్టా, ఇన్వెకాస్ చైర్మన్ దశరథ్ గుడే హాజరుకానున్నారు. జేఎన్టీయూకే ఉపకులపతి ప్రొఫెసర్ సీఎస్ఆర్కే ప్రసాద్ కార్యక్రమానికి అధ్యక్షత వహించనున్నారు. వర్సిటీలో అభ్యాసం, సాంకేతికత, సామాజిక బాధ్యతపట్ల స్ఫూర్తి కల్పించడం, పూర్వవిద్యార్థులు, ప్రస్తుత విద్యార్థుల మధ్య బంధాలను మరింత బలపరచడం, వివిధ రంగాల్లో విజయాలు సాధించిన పూర్వవిద్యార్థులను సత్కరించడంతోపాటు సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నామని తెలిపారు.

ఏడాది చివరి నాటికి లబ్ధిదారులకు టిడ్కో ఇళ్లు అప్పగిస్తాం

- మంత్రి నారాయణ

సామర్లకోట, జూలై 15(ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా పంపిణీకి నోచుకోని టిడ్కో ఇళ్ల సమస్యలన్నింటినీ ఈఏడాది చివరిలోగా పరిష్కరించి లబ్ధిదారులకు అప్పగించేందుకు అన్ని చర్యలు చేపట్టామని రాష్ట్ర మున్సిపల్ మంత్రి, కాకినాడ జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొంగూరి నారాయణ వెల్లడించారు. కాకినాడ జిల్లా సామర్లకోటలో ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్పతో కలిసి మంగళవారం రాత్రి ఆయన పలు అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు చేశారు. ఈ సందర్భంగా మంత్రి నారాయణ విలేఖరులతో మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా 7లక్షలమంది టిడ్కో గృహాల అప్పగింత కోసం ఎదురుచూస్తున్నారన్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో టిడ్కో ఇళ్లను నిర్వీర్యం చేసిన కారణంగా వారి హయాంలో చెల్లించాల్సిన రూ.160కోట్లను సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకువెళ్లి బ్యాంకులకు చెల్లించామన్నారు. రాష్ట్రవ్యాప్తంగా టిడ్కో గృహ సముదాయాల్లో మౌలిక సదుపాయాలన్నింటినీ త్వరలోనే పూర్తి చేసి లబ్ధిదారులకు అప్పగిస్తామన్నారు. సామర్లకోట, పెద్దాపురం మున్సిపాల్టీల్లో చెరొక రూ.35కోట్ల నిధులతో అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే చినరాజప్ప సూచనలకు ఆమోదం లభించిందన్నారు. త్వరలోనే టెండర్ ప్రక్రియలు పూర్తయి పనులు మొదలుపెట్టనున్నట్లు తెలిపారు. గత ప్రభుత్వం చేసిన అవకతవకలతో ఆర్థికశాఖ పూర్తిగా ఛిన్నాభిన్నమైందన్నారు. అయినా ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలన్నీ తు.చ తప్పకుండా అమలు చేసుకుంటూ కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలోనే సుపరిపాలన అందించామన్న తృప్తిని పొందామని మంత్రి నారాయణ స్పష్టం చేశారు.

వెంకన్న భక్తులకు ఇబ్బందులు లేకుండా చూడాలి

- అధికారుల సమీక్షలో ఎమ్మెల్యే సత్యానందరావు

ఆత్రేయపురం, జూలై 15(ఆంధ్రజ్యోతి): కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయానికి వివిధ రాష్ట్రాల నుంచి శనివారం వేలాదిగా తరలివచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా వివిధశాఖల అధికారులు చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే బండారు సత్యానందరావు ఆదేశించారు. మంగళవారం ఆర్డీవో శ్రీకర్ అధ్యక్షతన డిప్యూటీ కమిషనర్ నల్లం సూర్యచక్రధరరావు, తహశీల్దారు రాజేశ్వరరావు, ఎంపీడీవో వెంకటరామన్, సీఐ విద్యాసాగర్, దేవదాయశాఖ డీఈ ఉదయకుమార్, ఇంజనీరింగ్ బృందంతో కలిసి క్షేత్రంలో చేపడుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. వివిధ శాఖల అధికారులతో ఆయన సమీక్షించారు. గత శనివారం సుమారు 70వేల మంది భక్తులు తరలివచ్చారని ప్రతి శనివారం భక్తులు పెరిగే అవకాశం ఉందన్నారు. భక్తులకు స్వామి వారి దర్శనం, తాగునీరు, వివిధ సౌకర్యాలు, అన్నప్రసాదం సక్రమంగా నిర్వహించాలని ఎమ్మెల్యే సూచించారు. ప్రత్యేక వైద్య శిబిరాలు ఏర్పాటు చేయడంతోపాటు వైద్యులు అందుబాటులో ఉండాలన్నారు. భద్రత ఏర్పాట్లపై పోలీసులకు సూచనలు చేశారు. ప్రతిభక్తుడు స్వామివారిని సంతృప్తిగా దర్శనం చేసుకుని వెళ్లాలని అసౌకర్యాలు కలుగకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఆయనసూచించారు. ఆలయ పరిసరాలు, పార్కింగ్ స్థలాలు, రోడ్లు, మరుగుదొడ్లు తదితర అభివృద్ధి పనులను ఆయన పరిశీలించారు.


వివిధ శాఖల అధికారులతో సమీక్షిస్తున్న ఎమ్మెల్యే బండారు

వెంకన్న ఆదాయం రూ.3.15లక్షలు

వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం వివిధ ప్రాంతాల నుండి వచ్చిన భక్తులు దర్శించుకున్నారు. నోము ఆచరించిన అష్టోత్తర పూజలు, నిత్యకళ్యాణాలు నిర్వహించుకున్నారు. స్వామివారిని దర్శించుకున్న భక్తులు అన్నప్రసాదం స్వీకరించారు. వివిధ సేవల ద్వారా ఒక్కరోజు ఆదాయం రూ.3,15,209 లభించినట్లు ఉపకమిషనరు, ఈవో నల్లం సూర్యచక్రధరరావు తెలిపారు.

శాకంబరిగా పెద్దాపురం మరిడమ్మ



భక్తుల కొంగు బంగారం అయిన పెద్దాపురం మరిడమ్మను ఆషాఢ మాసోత్సవాల్లో భాగంగా మంగళవారం పలు రకాల కూరగాయలు, ఆకు కూరలతో సర్వాంగసుందరంగా అలంకరించారు. శాకంబరిగా దర్శనమిచ్చిన అమ్మవారిని చూసి భక్తులు తన్మయత్వం చెందారు. వారికి ఎటువంటి అసౌకర్యం కలగకుండా దేవస్థానం సహాయ కమిషనరు కె.విజయలక్ష్మి ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

- పెద్దాపురం (ఆంధ్రజ్యోతి)



ఆయోధ్యలో పర్యటిస్తున్న పీఐసీ బృందం

సహకార సంఘాల ఆర్థిక పరిపుష్టికి ప్రణాళికలు

- డీసీసీబీ చైర్మన్ తుమ్మల బాబు

పెద్దాపురం, జూలై 15 (ఆంధ్రజ్యోతి): సహకార సంఘాల ఆర్థిక పరిపుష్టికి రాష్ట్ర ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేస్తోందని డీసీసీబీ చైర్మన్ తుమ్మల రామస్వామి (బాబు) పేర్కొన్నారు. ఆప్కాబ్ పర్సన్ ఇన్‌చార్జి (పీఐసీ), సీనియర్ అధికారులు మార్గయాత్రలో భాగంగా ఉత్తర ప్రదేశ్‌లోని ఆయోధ్య డీసీసీబీని సందర్శించారు. సహకార రంగంలో అమలు చేస్తున్న ఉత్తమ పద్ధతులను ప్రత్యక్షంగా అధ్యయనం చేయడం, వాటి అమలులో విజయవంతమైన మార్గాలను తెలుసుకోవడం ప్రధాన ఉద్దేశ్యంగా ఈ సందర్శన కొనసాగుతోందని బాబు తెలిపారు. గతంలో నష్టాలను చవిచూసినా ప్రభుత్వం పారదర్శక విధానాల అనుసరణ ద్వారా నష్టాల ఊబి నుంచి బయటపడుతున్నామని ఆయన చెప్పారు. ఆర్థిక పునరుద్ధరణ, స్వతంత్ర ప్రణాళికలు, ఆదాయ మార్గాలను విస్తరణ చేయడం, సంక్షేమ పథకాలను వినియోగదారులకు సమర్థవంతంగా చేరవేయడం, నిధుల వినియోగం తదితర అంశాలపై అవగాహన పెంపొందించుకున్నామని రామస్వామి వివరించారు.

కేబుల్ ఆపరేటర్లపై రాజకీయం తగదు

- లక్షలాది మంది ఉపాధిని దెబ్బతీయొద్దు
- కార్పొరేట్ కంపెనీలకు కొమ్ముకాస్తే ఊరుకోం
- ఫైబర్‌నెట్ ఆపరేటర్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు బండారు కృష్ణమూర్తి


మీడియా సమావేశంలో మాట్లాడుతున్న కృష్ణమూర్తి

కాకినాడ/కాకినాడ సిటీ, జూలై 15 (ఆంధ్రజ్యోతి): స్వయం ఉపాధి రంగంలో జీవనోపాధి పొందుతున్న సెమీ స్కిల్డ్ కేబుల్ ఆపరేటర్ వ్యవస్థ పట్ల చిన్నచూపుతో వ్యవహరించడం వైసీపీ నేత, మాజీ మంత్రి అంబటి రాంబాబుకు ఏమాత్రం తగదని ఫైబర్‌నెట్ ఆపరేటర్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు బండారు కృష్ణమూర్తి అన్నారు. కేబుల్ ఆపరేటర్లను విమర్శిస్తూ కార్పొరేట్ కంపెనీలకు లబ్ధి చేకూర్చేలా అంబటి చేసిన వ్యాఖ్యలను ఖండిస్తూ మంగళవారం ఆయన కాకినాడలో మీడియాతో మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా 25వేల కేబుల్ ఆపరేటర్లతో పాటు వారి వద్ద ప్రత్యక్షంగా, పరోక్షంగా సుమారు లక్ష మంది స్వయం ఉపాధి పొందుతున్నారన్నారు. సమస్య మూలం ఎక్కడుందో తెలుసుకుని ప్రత్యక్షంగా అక్కడే తేల్చుకోవాలి తప్ప ఎలాంటి సంబంధం లేని కేబుల్ ఆపరేటర్లకు నష్టం వాటిల్లేలా రాంబాబు మాట్లాడడం మంచిది కాదన్నారు. ఏపీ ఫైబర్‌నెట్ సంస్థ పురోగతికి తీసుకోవాల్సిన భవిష్యత్తు ప్రణాళికపై సోమవారం ముఖ్యమంత్రి చంద్రబాబు సమీక్ష నిర్వహించడంపై ధన్యవాదాలు తెలిపారు. కొన్నేళ్లుగా ఏపీ ఫైబర్‌నెట్ కోల్పోయిన కనెక్షన్ల వల్ల అటు సంస్థతో పాటు ఇటు ఏపీఎస్ఎఫ్ఎల్ కేబుల్ ఆపరేటర్లు కూడా తీవ్రంగా నష్టపోయారని, ఈ విషయంపై రాష్ట్ర ప్రభుత్వం ఆలోచించి కేబుల్ ఆపరేటర్లకు తగు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో కేబుల్ సంఘం సీనియర్ నాయకులు అడపా వెంకటరావు, మల్లిపూడి శ్రీనివాస్, రాయుడు సూర్యప్రకాష్‌రావు తదితరులు పాల్గొన్నారు.

గిన్నిస్ రికార్డు గ్రహీత శ్యామలకు ఎమ్మెల్యే అభినందన

కాకినాడ సిటీ, జూలై 15 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ ఓపెన్ వాటర్ స్విమ్మర్ గోలి శ్యామల కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబును మంగళవారం ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. 2024లో విశాఖ నుంచి కాకినాడ వరకు సముద్రంలో 150 కిలోమీటర్లు ఈది గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డు సాధించానని, 30 కిలోమీటర్ల పొడవైన పాక్ జలసంధిని 13.47 గంటల్లో ఈది ప్రపంచంలో భారతదేశ రెండో మహిళగా, తొలి తెలుగు మహిళగా రికార్డు సృష్టించానని వివరించారు. శ్యామలకు గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డును ఎమ్మెల్యే అందజేసి భవిష్యత్తులో మరిన్ని రికార్డులు సాధించాలని ఆకాంక్షించారు.


శ్యామలకు గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డు అందజేస్తున్న ఎమ్మెల్యే కొండబాబు

ప్రభుత్వ, ప్రైవేటు ఐటీఐల్లో రెండో విడత ప్రవేశానికి గడువు పొడిగింపు

కార్పొరేషన్ (కాకినాడ), జూలై 15 (ఆంధ్రజ్యోతి): కాకినాడ, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు ఐటీఐల్లో 2025-26 సంవత్సరానికి ప్రవేశం కోసం రెండో విడత కౌన్సెలింగ్‌ను ఏఐటీటీ-2025 పరీక్షల కారణంగా పొడిగించినట్టు కాకినాడ ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్ ఎం.వేణుగోపాల్ తెలిపారు. ఈ నెల 20లోపు అడ్మిషన్ రిజిస్ట్రేషన్, 22వ తేదీలోపు సర్టిఫికెట్ల వెరిఫికేషన్ చేయించుకోవాలన్నారు. ఈ నెల 23, 24, 25 తేదీల్లో ప్రభుత్వ ఐటీఐల్లోను, 26, 27 తేదీల్లో ప్రైవేటు ఐటీఐల్లో కౌన్సెలింగ్ నిర్వహిస్తామని చెప్పారు. మరిన్ని వివరాలకు 0884-2348182, 9440408182 నెంబర్లను సంప్రదించాలన్నారు.

20న ఉమ్మడి జిల్లా బాస్కెట్‌బాల్ బాలికల జట్టు ఎంపిక

పిఠాపురం, జూలై 15 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా బాస్కెట్‌బాల్ బాలికల జట్ల ఎంపిక ఈ నెల 20న కాకినాడ జిల్లా పిఠాపురం పాత బస్టాండు వద్ద గల మునిసిపల్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో జరుగుతుందని ఉమ్మడి జిల్లా బాస్కెట్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శి బొజ్జా మాణిక్యాలరావు (అయలు) తెలిపారు. 2007 జనవరి 1 తర్వాత పుట్టిన వారే అర్హులని చెప్పారు. ఇక్కడ ఎంపికైన వారు పిఠాపురంలో ఆగస్టు 14 నుంచి జరిగే 10వ ఆంధ్ర రాష్ట్ర బాస్కెట్‌బాల్ చాంపియన్‌షిప్‌లో పాల్గొంటారని తెలిపారు. ఆసక్తి గలవారు పుట్టిన తేదీ ధ్రువీకరణ పత్రం, ఆధార్ కార్డు ఒరిజనల్‌తో 20వ తేదీ ఉదయం ఎనిమిది గంటలకు కాకినాడలోని జిల్లా క్రీడా మైదానం వద్దకు రావాలని సూచించారు.

సత్యదేవ నిత్యాన్నదాన పథకానికి రూ.లక్ష విరాళం


అన్నదాన విభాగం సూపరింటెండెంట్ సతీష్‌కు విరాళం అందజేస్తున్న బాల

అన్నవరం, జూలై 15 (ఆంధ్రజ్యోతి): అన్నవరం దేవస్థానంలో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న సత్యదేవ నిత్యన్నదాన పథకానికి మంగళవారం ఒక దాత రూ.లక్ష విరాళంగా సమర్పించారు. తెలంగాణ రాష్ట్రంలోని నాగోల్‌కు చెందిన వేముల బాల ఈ మొత్తాన్ని అన్నదాన విభాగం సూపరింటెండెంట్ కోటమర్తి సతీష్‌కు అందజేయగా దాతను ఆయన అభినందించారు. కార్యక్రమంలో కంచిభట్ల రాంబాబు పాల్గొన్నారు.

సత్యదేవుని సన్నిధిలో తెలంగాణ మంత్రి లక్ష్మణ్‌కుమార్

అన్నవరం, జూలై 15 (ఆంధ్రజ్యోతి): రత్నగిరివాసుడైన సత్యదేవుని సన్నిధికి మంగళవారం తెలంగాణ రాష్ట్ర మంత్రి లక్ష్మణ్‌కుమార్ విచ్చేశారు. ఆయన కుటుంబసభ్యులతో కలిసి స్వామి, అమ్మవార్లను దర్శించుకుని దర్శించి ప్రత్యేక పూజలు చేశారు. మంత్రికి పీఆర్వో కృష్ణారావు ఆలయ మర్యాదలతో ఘన స్వాగతం పలికారు. దర్శనానంతరం ఆయనకు వేద పండితులు వేదాశీర్వచనాలు అందజేశారు.


మంత్రికి స్వామివారి చిత్రపటం అందజేస్తున్న దృశ్యం

నిర్లక్ష్యం ఖరీదు... నిండు ప్రాణం

» ప్రసవ సమయంలో గిరిజన మహిళ మృతి
» రంపచోడవరం ఏరియా ఆసుపత్రిలో ఘటన
» ఆలస్యంగా వెలుగులోకి..




కాకూరి పార్వతి (ఫైల్‌ఫొటో)
పార్వతికి ప్రసవించిన బిడ్డ

రంపచోడవరం/వై. రామవరం, జూలై 15 (ఆంధ్రజ్యోతి): రంపచోడవరం ఏరియా ఆస్పత్రిలో నిర్లక్ష్యానికి వై.రామవరం మండలానికి చెందిన కాకూరి పార్వతి అనే గర్భస్థ గిరిజన మహిళ తక్షణం మృతిచెందిన విషయం ఆలస్యంగా వెలుగుచూసింది. ఈ నెల 11న జరిగిన ఈ ఘటనను ఆసుపత్రి వైద్యులు అత్యంత గోప్యంగా ఉంచడం శోచనీయం. దీని పూర్వాపరాలిలా ఉన్నాయి. అల్లూరి జిల్లా వై.రామవరం మండలం జాజిగడ్డ గ్రామానికి చెందిన కాకూరి పార్వతి జూన్ 28న వై.రామవరం కమ్యూనిటీ ఆస్పత్రి నుంచి రంపచోడవరం ఏరియా ఆస్పత్రికి ప్రసవం కోసం తీసుకువచ్చారు. 13రోజుల పాటు ఆమెను ఇక్కడే ఉంచారు. ఈనెల 11న ఆమెకు సాధారణ ప్రసవం చేశారు. బిడ్డ జన్మించిన వెంటనే ఆమె మరణించింది. బిడ్డను కూడా తదుపరి పర్యవేక్షణ కోసం కాకినాడ సాధారణ ఆస్పత్రికి తరలించారు. కాకూరి పార్వతికి ఇది రెండో ప్రసవం. తొలి ప్రసవం కూడా సాధారణంగా అప్పట్లో రాజమండ్రి ఆస్పత్రిలో జరిగింది. ఆమె విషయంలో రంపచోడవరం ఆసుపత్రిలో సరైన వైద్యపర్యవేక్షణ కరువైందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. అన్ని పరీక్షలు చేసిన తర్వాత మాత్రమే గైనకాలజిస్టు పర్యవేక్షణలో ప్రసవాన్ని నిర్వహిస్తారు. సాధారణ ప్రసవానికి అవకాశం లేని పరిస్థితుల్లో అన్ని వసతులూ ఉన్న ఆసుపత్రిలో సిజేరియన్ చేస్తారు. కానీ ఇక్కడ ఏం జరిగిందన్నది ఎవరూ చెప్పడం లేదు.

● ఐటీడీఏ పీవో చెప్పిన రోజే..

ఈనెల 11నే రంపచోడవరం ఐటీడీఏ పీవో రంపచోడవరం ఏరియా ఆస్పత్రిని తనిఖీ చేసి రోగులపట్ల అత్యంత జాగ్రత్తగా వ్యవహరించి ఎటువంటి ప్రాణహానీ లేకుండా చూడాలని, అత్యవసర కేసులను హుటాహుటిన కాకినాడకో, రాజమండ్రికో తరలించాలని, ఇందులో ఏ నిర్లక్ష్యాన్ని సహించేది లేదని హెచ్చరించిన రోజునే గిరిజన మహిళ మరణం చోటుచేసుకుంది. అసలు ఈ ప్రసవం జరిగే సమయంలో వైద్యుల పర్యవేక్షణ ఉందా లేదా అన్నది కూడా తేలాల్సి ఉంది. తన భార్య మరణానికి వైద్యుల నిర్లక్ష్యమే కారణమని కాకూరి పార్వతి భర్త దుర్గాప్రసాద్ ఆరోపిస్తున్నారు. 13 రోజులపాటు తన భార్య ఏరియా ఆస్పత్రిలోనే ఉన్నా ఆమె పరిస్థితి ఏంటో గ్రహించకుండానే ప్రసవం చేశారని, ఆ సమయంలో ఏదో కారణంతో తన భార్య చనిపోయిందని చెప్పి తనతో కాగితాలపై సంతకాలు తీసుకున్నారని ఆయన చెప్తున్నారు. రంపచోడవరం ఏరియా ఆస్పత్రి నిర్లక్ష్యానికి తన ఇద్దరు బిడ్డలకు తల్లి లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చనిపోయిన భార్యకు అంత్యక్రియలు చేసుకోవాలో, తన పసిగుడ్డును కాపాడుకోవడానికి కాకినాడకు వెళ్లాలో తేల్చుకోలేక దుర్గాప్రసాద్ నలిగిపోయాడు. తన ఆవేదనను దిగమింగుకుని భార్య అంతిమ సంస్కాలు నిర్వహించి తన బిడ్డను కాకినాడ ఆస్పత్రిలో సంరక్షించుకుంటున్నాడు. ఈ ఘటనపై ఇంత వరకూ కనీస విచారణకు కూడా ఐటీడీఏ కానీ, వైద్య విధాన పరిషత్తు ఉన్నతాధికారులు కానీ ఆదేశించకపోవడం శోచనీయం. కాగా దీనిపై పాడేరులోని ఆరోగ్యసేవల జిల్లా కోఆర్డినేటర్ డా.నీలవేణి వివరణ ఇస్తూ గిరిజన మహిళ ప్రసవ సమయంలో మృతిచెందిన ఘటన తన దృష్టికి వచ్చిందని, దీనిపై తమ డైరెక్టరుకు సమాచారం ఇచ్చామని, అక్కడినుంచి ఆదేశాల కోసం ఎదురుచూస్తున్నామని స్పష్టం చేశారు.

అంతర్ రాష్ట్ర దొంగ అరెస్ట్

● చోరీ సొత్తు స్వాధీనం



వివరాలు వెల్లడిస్తున్న సీఐ, తదితరులు

సామర్లకోట, జూలై 15 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా సామర్లకోట పట్టణ శివారు కొత్త వంతెన సమీపంలో మంగళవారం అనుమానాస్పదంగా తిరుగుతున్న అంతర్ రాష్ట్ర నేరస్థుడు కంచర్ల మోహనరావు అలియాస్ మోహన్‌గా గుర్తించి సామర్లకోట పోలీసులు అరెస్టు చేశారు. అలాగే అతని వద్ద నుంచి 50 గ్రాముల బంగారం, 300 గ్రాముల వెండి ఆభరణాలు స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించినట్టు సామర్లకోట సీఐ కృష్ణభగవాన్ తెలిపారు. క్రైం సీఐ అంకబాబు, పెద్దాపురం ఎస్‌డీపీవో శ్రీహరిరాజు నేతృత్వంలో నిఘా వేసి పట్టుకున్నామన్నారు. కేసుకు సంబంధించి ఎస్ఐ రమేష్‌బాబు, తదితర క్రైం సిబ్బందిని ఎస్‌డీపీవో అభినందించారు.

ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు ఢీకొని ఒకరి మృతి

● మరొకరికి తీవ్ర గాయాలు



అవిడి సత్తిపండు (ఫైల్ ఫొటో)

రావులపాలెం, జూలై 15 (ఆంధ్రజ్యోతి): మోటార్‌సైకిల్‌తో జాతీయ రహదారిని దాటుతున్న ఇద్దరి వ్యక్తులను ఓ ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు ఢీకొంది. దీంతో ఒకరు మృతిచెందగా, మరొకరు తీవ్రగాయాలపాలయ్యారు. వివరాల్లోకి వెళితే రావులపాలెం మండలం గోపాలపురానికి చెందిన అవిడి సత్తిపండు (51), అతడి స్నేహితుడు అత్తిలి ఏసుబాబు కలిసి ఓ పని మీద మోటార్‌సైకిల్‌పై వెళ్లి తిరిగి వస్తుండగా గోపాలపురం చెక్‌పోస్టు వద్దకు వచ్చేసరికి వెనుక నుంచి వేగంగా వచ్చిన ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు ఢీకొంది. దీంతో తీవ్రగాయాలైన ఇరువుర్ని కొత్తపేట ఆసుపత్రికి తరలించగా, సత్తిపండు అప్పటికే మృతిచెందినట్టు వైద్యులు ధ్రువీకరించారు. ఏసుబాబుకు వైద్యం అందించగా, పరిస్థితి విషమంగా ఉండటంతో రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు రావులపాలెం సీఐ శేఖర్‌బాబు తెలిపారు.

గోకివాడ, పి.దొంతమూరు

ఫీల్డ్ అసిస్టెంట్ల సస్పెన్షన్

పిఠాపురం రూరల్, జూలై 15 (ఆంధ్రజ్యోతి): జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనుల నిర్వహణలో అవకతవకలకు పాల్పడిన కాకినాడ జిల్లా పిఠాపురం మండలం గోకివాడ, పి.దొంతమూరు ఫీల్డ్‌అసిస్టెంట్లను సస్పెండ్ చేస్తూ డ్వామా పీడీ అడపా వెంకటలక్ష్మి ఉత్తర్వులు జారీ చేశారు. ఇవి మంగళవారం పిఠాపురం మండల పరిషత్ కార్యాలయానికి చేరాయి. గోకివాడ ఫీల్డ్ అసిస్టెంట్ రాపా నవరత్నం ఒక వ్యక్తికి ఆరు రోజులు మస్తరు వేసి రూ.1,411 చెల్లించినట్టు అదే గ్రామానికి చెందిన గరగ నాగేశ్వరరావు డ్వామా, పాడా పీడీలకు ఫిర్యాదు చేశారు. దీనిపై ఏపీడీ వసంతమాధవి విచారణ చేపట్టి నిధుల దుర్వినియోగానికి పాల్పడినట్టు గుర్తించడంతో విధుల నుంచి తాత్కాలికంగా తొలగించారు. అలాగే పి.దొంతమూరు ఫీల్డ్ అసిస్టెంట్ విఘ్నేశ్వరరావు పనులోకి రాకుండానే పలువురి పేర్లపై మస్తర్లు వేసి సుమారు రూ.25వేలు దుర్వినియోగం చేసినట్టు విచారణలో వెల్లడైంది. దీంతో ఆయన్ను సస్పెండ్ చేశారు. వీరిద్దరి సస్పెన్షన్‌ను ఏపీవో నాయుడు ధ్రువీకరించారు.

హ్యాట్సాఫ్ .. డ్రైవర్!

● ఎగ ఊపిరితో బాధపడుతున్న కండక్టర్ గణేష్
● గమనించి ఆర్టీసీ బస్సునే అంబులెన్స్‌గా చేసి ఆసుపత్రికి తరలింపు
● కండక్టర్ ప్రాణాలు కాపాడిన డ్రైవర్ కుమార్‌కు తోటి సిబ్బంది అభినందనలు




ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న కండక్టర్ గణేష్, పక్కన ఆర్టీసీ బస్సు

రాజమహేంద్రవరం, జూలై 15 (ఆంధ్రజ్యోతి): వైద్యో నారాయణో హరిః అంటారు.. ఎందుకంటే ప్రాణాలు నిలిపేవాడు వైద్యుడు.. ఆయన దేవుడితో సమానమని అర్థం. అయితే.. మంగళవారం జరిగిన సంఘటన చూస్తే డ్రైవరో నారాయణో హరిః అనాలేమో!. తక్షణం స్పందించిన ఆర్టీసీ డ్రైవర్ కండక్టర్ ఊపిరిని టాప్ గేర్‌లో నిలిపారు. వివరాల్లోకి వెళ్తే.. రాజమహేంద్రవరం-సీతానగరం, పురుషోత్తపట్నం షటిల్ సర్వీసు బస్సు నడుస్తోంది. దానికి గణేష్ కండక్టరు కాగా.. డ్రైవర్‌గా కాటవరానికి చెందిన యూఎస్ కుమార్ ఉన్నారు. ఎండ మండిపోతున్నా.. మంగళవారం నాలుగు ట్రిప్పులు వేశారు. ఐదో ట్రిప్పు వెళ్లి బుధవారం ఉదయం మొదటి బస్సుగా పురుషోత్తపట్నం నుంచి రావాల్సి ఉంది. అయితే, నాలుగో ట్రిప్పుగా గోకవరం బస్టాండుకు వచ్చిన తర్వాత తిరిగి వెళ్లడానికి ఒక గంట సమయం ఉంది. ఈలోపు బస్సులోనే ఉన్న గణేశ్ ఎగఊపిరితో ఆందోళన పడుతున్నాడు. గుండెపై చేయివేసుకొని తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారు. ఇది గమనించిన డ్రైవర్ కుమార్ అంబులెన్స్ కోసం ఎదురుచూడలేదు.. తన పైఅధికారి (ఆర్టీసీ సీఐ)కి ఫోన్ చేశారు. వెంటనే ఆస్పత్రికి తీసుకెళ్లమని ఆదేశించడంతో బస్సును టాప్ గేర్‌లో ప్రభుత్వాస్పత్రికి తీసుకొచ్చారు. అంతే వేగంతో స్పందించిన డాక్టర్ భారతి ఆయన్ని పరీక్షించి ఈసీజీ, తదితర వైద్య పరీక్షలు చేశారు. ప్రస్తుతం ఆయన ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని చెప్పడంతో తోటి సిబ్బంది అంతా ఊపిరి పీల్చుకున్నారు. అయితే.. ఎండలు మండిపో తున్న వేళ కనీస విశ్రాంతి లేకుండా బస్సులు తిప్పడంతో సిబ్బంది ప్రాణాలపైకి వస్తోందనే ఆవేదన వ్యక్తమవుతోంది. రెండేళ్ల క్రితం ఇలాగే ఒక డ్రైవర్‌కు గుండెపోటు రావడంతో నేరుగా ప్రభుత్వాస్పత్రికి బస్సును నడిపించారు. ఆ సమయంలో బస్సులో ప్రయాణికులు ఉన్నారు. డ్రైవర్ ప్రాణాలను సైతం లెక్కచేయకుండా వ్యవహరించడంతో ఆయనకు. ప్రయాణికులకు ప్రమాదం తప్పింది. ఆర్టీసీ సిబ్బంది నిబంధనల ప్రకారం వైద్యప రీక్షలు నిర్వహిం చకపోవడంతో ఇలాంటి తీవ్రమైన సమస్యలు వస్తున్నట్టుగా తెలుస్తోంది.

‘అనకాపల్లి’ టు గొల్లప్రోలు

● గంజాయిని కొనుగోలు చేసి తెస్తూ విక్రయాలు
● పట్టుబడిన ఐదుగురు యువకులు... అందులో ఒక బాలుడు
● నాలుగు కిలోల గంజాయి, ఒక మోటార్ సైకిల్ స్వాధీనం
● నిందితుల్ని అరెస్టు చేసిన గొల్లప్రోలు పోలీసులు



నిందితులను చూపుతున్న పిఠాపురం సీఐ శ్రీనివాస్, గొల్లప్రోలు ఎస్ఐ రామకృష్ణ

గొల్లప్రోలు, జూలై 15 (ఆంధ్రజ్యోతి): అనకాపల్లి జిల్లా నుంచి గంజాయిని కొనుగోలు చేసి తెచ్చి విక్రయిస్తున్న ఐదుగురు యువకులను కాకినాడ జిల్లా గొల్లప్రోలు పోలీసులు అరెస్టు చేశారు. ఈ మేరకు మంగళవారం పిఠాపురం సీఐ జి.శ్రీనివాస్, గొల్లప్రోలు ఎస్ఐ ఎన్.రామకృష్ణ విలేకరులకు వివరాలను వెల్లడించారు. గొల్లప్రోలు పట్టణ శివారు ఈబీసీ కాలనీ దాటిన తర్వాత ఉన్న ఒక ప్రైవేట్ లే-ఔట్‌లో గంజాయి విక్రయిస్తున్నట్టు అందిన సమాచారం మేరకు సీఐ, ఎస్ఐ ఆకస్మికంగా దాడులు నిర్వహించారు. ఆ సమయంలో నలుగురు యువకులు గంజాయిని వాటాలుగా వేసుకుంటున్న దాన్ని గుర్తించారు. అలాగే వారి వద్ద నుంచి నాలుగు కిలోల గంజాయి, ఒక మోటార్ సైకిల్ స్వాధీనం చేసుకున్నారు. వారిని అదుపులోకి తీసుకుని విచారించగా అనకాపల్లి జిల్లా నక్కపల్లి మండలంలో గంజాయి సరఫరా చేసే వ్యక్తి నుంచి తీసుకువచ్చి, అందులో కొంత వారి వినియోగానికి ఉంచుకుని, మిగిలిన దాన్ని అధిక ధరలకు విక్రయిస్తున్నట్టు వెల్లడైంది. ఇందులో కాకినాడ రేచర్లపేటకు చెందిన కడియపు ప్రేమ్‌కుమార్, మరో బాలు డు, నక్కపల్లి మండలం రాజంపేటకి చెందిన మడ్డు లోకేష్, పిఠాపురం మంగాయమ్మరావుపేటకు చెందిన ధనాల మనోహర్, కొత్తపల్లి మం డలం మూలపేటకి చెందిన రామిశెట్టి దుర్గాప్రసాద్‌ను అరెస్టు చేశారు. నిందితుల్ని కోర్టులో హాజరుపరు స్తామని సీఐ చెప్పారు.

సాధారణ స్థాయికి గోదావరి ప్రవాహం



రాజమహేంద్రవరం వద్ద వరద ప్రవాహం



ధవళేశ్వరం, జూలై 15 (ఆంధ్రజ్యోతి): ఐదు రోజులుగా ఉధృతంగా ప్రవహించిన గోదావరి క్రమంగా సాధారణ స్థాయికి చేరుకుంటోంది. ధవళేశ్వరం వద్ద బుధవారం సాయంత్రానికి కాటన్ బ్యారేజ్ 175 గేట్లను 0.30 మీటర్ల మేర పైకి ఎత్తి 1,59,747 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. దీంతో గోదావరి నీటిమట్టం 10.70 అడుగులుగా నమోదయింది. వ్యవసాయ అవసరాల కోసం 3 డెల్టాలకు 14400 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. ఎగువన భద్రాచలం వద్ద క్రమంగా తగ్గుతున్న నీటి మట్టం బుధవారం సాయంత్రానికి 18.40 అడుగులకు చేరుకుంది.

ఆంధ్రా పాలిటెక్నిక్‌లో స్పాట్ అడ్మిషన్లకు

దరఖాస్తుల ఆహ్వానం

సర్పవరం జంక్షన్, జూలై15 (ఆంధ్రజ్యోతి) : కాకినాడ ఆంధ్రా పోలిటెక్నిక్ కళాశాలలో ఇంటర్మీడియెట్ ఒకేషనల్ ద్వారా రెండో సంవత్సరంలో డిప్లొమో కోర్సుల్లో మిగిలిన సీట్ల కోసం ఈనెల 19న స్పాట్ అడ్మిషన్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు ప్రిన్సిపాల్ ఎన్.జనార్థనరావు ఓ ప్రకటనలో తెలియజేశారు. దీనికి ఐవీసీ-2025, ఇంటర్ ఒకేషనల్ ఉత్తీర్ణత సాధించిన వారు అర్హులన్నారు. ఈనెల 18వ తేదీ సాయంత్రం 5గంటల్లోపు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ఏదొక పాలిటెక్నిక్ కాలేజీలో 6 నుంచి ఇంటర్ వరకూ స్టడీ సర్టిఫికెట్లు, టెన్త్, ఇంటర్ మార్కుల మెమోలు టీసీ, కుల ధ్రువీకరణ సర్టిఫికెట్ల జెరాక్స్ కాపీలతో దరఖాస్తులను అందజేయాలని కోరారు. 19న కాకినాడ ఏపీటీలో జరిగే కౌన్సెలింగ్‌కు హాజరు కావాలని కోరారు.

పొగాకు సాగు పరిమితికి మించొద్దు

పొగాకు బోర్డు చైర్మన్ యశ్వంత్‌కుమార్



దేవరపల్లిలో పొగాకు వేలాన్ని పరిశీలిస్తున్న యశ్వంత్‌కుమార్

దేవరపల్లి, జూలై 15(ఆంధ్రజ్యోతి): పొగాకు పంటను పరిమితి మేరకే పండించాలని పొగాకు బోర్డు చైర్మన్ యశ్వంత్‌కుమార్ అన్నారు. తూర్పుగోదావరి జిల్లా దేవరపల్లిలో పొగాకు వేలం కేంద్రాన్ని మంగళవారం ఆయన సందర్శించి వేలం ప్రక్రియను పరిశీలించారు. రైతుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జరిగిన విలేకర్ల సమావేశంలో యశ్వంత్‌కుమార్ మాట్లాడుతూ ప్రపంచ ఆరోగ్య సంస్థలో పొగాకు పంట నియంత్రణ ఒప్పందంపై మన దేశం కూడా సంతకం చేసిందని, దానికి మేరకే పొగాకు పంటను పండించాలన్నారు. రైతులు పొగాకుతో పాటు ప్రత్యామ్నాయ పంటలు పండించుకోవాలన్నారు. జింబాబ్వే, బ్రెజిల్, టాంజానియా, యుగండ, ఆఫ్రికా దేశాల్లో పొగాకు ఉత్పత్తి పెరిగిందని, దాని ప్రభావం మన పొగాకుపై పడుతుందన్నారు. ఈ ఏడాది 61మిలియన్ కిలోల పొగాకు పంటకు అనుమతిస్తే 80 మిలియన్ కిలోలు పండించారన్నారు. వచ్చే ఏడాది 49 మిలియన్ కిలోలకే అనుమతి ఇచ్చినట్టు ఆయన తెలిపారు. ఈ ఏడాది అక్టోబర్ నెలలో వేయాల్సిన నాట్లు ఆలస్యంగా వేశారన్నారు. భాదవ, నల్ల నెలల్లో వర్జీనియ పొగాకు పండించడం వల్ల నాణ్యత కోల్పోతుం దని దాని ప్రభావం మన పొగాకుపై పండు తుందన్నారు. గత ఏడాది పొగాకు అదనపు పంటపై సెస్ లేకుండా రూ.124 కోట్లు రైతులకు లబ్ధి చేకూరిందని ఈ ఏడాది ఆ పరిస్థితి ఉండదన్నారు. అమ్మకాలు సెప్టెంబరు నెలాఖరుకు పూర్తవుతాయన్నారు. కార్యక్రమంలో రాజమ హేంద్రవరం పొగాకు బోర్డు రీజనల్ మేనేజర్ ప్రసాద్, దేవరపల్లి పొగాకుబోర్డు వేలం నిర్వహణాధికారి హేమస్మిత, రైతు సంఘం నాయకులు కరుటూరి శ్రీనివాసరావు, కేవీవీ సత్యనారాయణ, రైతులు యాగంటి వెంకటేశ్వరరావు, బిక్కిన నాగరాజు, యగంటి సాయిబాబు పాల్గొన్నారు.

ఓడలరేవు ఓఎన్జీసీ ప్లాంటులో మంటలు

అదుపు చేసిన ఫైర్ సిబ్బంది

అల్లవరం, జూలై 15 (ఆంధ్రజ్యోతి): బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అల్లవరం మండలం ఓడలరేవు ఓఎన్జీసీ టెర్మినల్ ప్రహరీ సమీపంలో ఆక్వా చెరువుల విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వద్ద మంగళవారం విద్యుత్ తీగలు కలిసిపోయి మంటలు వ్యాపించాయి. విద్యుత్ లైన్‌మెన్ సరఫరాను నిలిపివేయడంతో ఓఎన్జీసీ ఫైర్ సిబ్బంది సకాలంలో స్పందించి మంటలను అదుపు చేశారు. ఈ ప్రమాదంలో మూడు తాడి చెట్లు దగ్ధమయ్యాయి. ఓడలరేవు తీరం సీఆర్‌జడ్ పరిధిలో ఆక్వా చెరువుల వద్ద నిబంధనలకు విరుద్ధంగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను నెలకొల్పగా తీగలు రెండు కిలోమీటర్ల పొడవునా నేలపైన పడడంతో యమపాశాలుగా మారాయి. అనధికార విద్యుత్ సరఫరా ఇవ్వడం వల్లే ప్రమాదానికి కారణంగా పలువురు భావిస్తున్నారు.

కుమార్తెల అదృశ్యంపై ఫిర్యాదు



కడియం, జూలై 15(ఆంధ్రజ్యోతి): తమ కుమార్తెలు కనిపించడం లేదని కడియం గ్రామానికి చెందిన పంద్రిళ్ల చెల్లా చంద్రారత్నం పోలీసులకు ఫిర్యాదు చేశారు. తమ పెద్ద కుమార్తె వీరనాగవల్లి పదో తరగతి, చిన్న కుమార్తె పద్మప్రియ తొమ్మిదో తరగతి చదువుకున్నారని, ప్రస్తుతం ఇంటి వద్దే ఉంటున్నారన్నారు. మంగళవారం ఉదయం గ్రామంలో ఉన్న ఆంజనేయస్వామి ఆలయానికి వెళ్లి వస్తామని చెప్పి వెళ్లిన వారు తిరిగి రాలేదని, వెళ్లే సమయంలో సెల్‌ఫోన్లు వెంట తీసుకెళ్లారని ఫిర్యాదులో పేర్కొన్నారు. వారి ఆచూకీ తెలిస్తే 94407 96587, 93477 05890 నెంబర్లకు సమాచారం అందించాలని పోలీసులు తెలిపారు.

భర్త కాపురానికి తీసుకెళ్లనన్నాడని ఆత్మహత్యాయత్నం

● గడ్డి మందు తాగిన భార్య.. ఆసుపత్రికి తరలింపు.. అత్తింటిపై కేసు



ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న శ్యామల

అమలాపురం రూరల్, జూలై 15 (ఆంధ్రజ్యోతి): ఉపాధి నిమిత్తం గల్ఫ్ దేశానికి వెళ్లి తిరిగి వచ్చిన భర్త.. భార్యపై అనుమానం పెంచుకోవడంతో పాటు కాపురానికి తీసుకెళ్లనని పెద్దల సమక్షంలో చెప్పడంతో అవమాన భారంతో భార్య గడ్డిమందు తాగి అమలాపురం ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. ఎస్ఐ వై.శేఖర్‌బాబు మంగళవారం తెలిపిన వివరాల ప్రకారం.. అమలాపురం హైస్కూలు సెంటర్‌కు చెందిన దూనబోయిన రమేష్‌తో నల్లమిల్లి రాజీవ్ గృహకల్పకు చెందిన శ్యామలతో వివాహం జరిగింది. వివాహమైన కొద్దికాలానికే రమేష్ ఉపాధి నిమిత్తం కువైట్ వెళ్లాడు. 8 నెలల క్రితం స్వగ్రామానికి వచ్చి తనకు తెలిసిన సెంట్రింగ్ పని చేసుకుని జీవిస్తున్నాడు. గల్ఫ్‌లో ఉండగానే భార్య శ్యామలపై అనుమానం పెంచుకున్నాడు. దాంతో ఈ నెల 14న నేదునూరు పెదపాలెంలో పెద్దల సమక్షంలో తగువు నిర్వహించారు. భార్యపై అనుమానం పెంచుకోవడం, కాపురానికి తీసుకెళ్లనని రమేష్ తెగేసి చెప్పడంతో సోమవారం రాత్రి ఇంటికి తిరిగి వచ్చిన శ్యామల ఇంట్లో ఉన్న గడ్డిమందును తాగేసింది. తల్లి గుర్తించే సరికే ఆమె అపస్మారక స్థితికి చేరుకుంది. దీంతో శ్యామలను హుటాహుటిన అమలాపురం ఏరియా ఆసుపత్రికి తరలించారు. అక్కడ మంగళవారం శ్యామల ఇచ్చిన సమాచారం ఆధారంగా భర్త రమేష్ కుటుంబ సభ్యులపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ శేఖర్‌బాబు తెలిపారు.

తుని పోలవరం పనుల్లో ప్రమాదం

ఇద్దరు కార్మికులకు తీవ్ర గాయాలు.. ఆసుపత్రికి తరలింపు

తుని రూరల్, జూలై 15(ఆంధ్రజ్యోతి): తుని పట్టణ శివారు కట్రాళ్లకొండ వద్ద జరుగుతున్న పోలవరం ఎడమ కాలువ నిర్మాణ పనుల్లో భాగంగా ఏర్పాటవుతున్న భారీ అక్విడెక్ట్ వద్ద ప్రమాదం జరిగింది. వెస్ట్ బెంగాల్‌కు చెందిన పలువురు కార్మికులు సుమారు వంద అడుగుల లోయలో ఐరన్ ఊచలు అమరుస్తుండగా ప్రమాదవశాత్తూ కార్మికులపై పడ్డాయి. దీంతో శ్రీనివాస్, రెహమాన్ అనే ఇద్దరి కార్మికులకు తీవ్ర గాయాలయ్యాయి. వారిని హుటాహుటిన బయటకు తీసి తుని ఏరియా ఆసుపత్రికి తరలించారు. వారికి వైద్యులు పరీక్షలు నిర్వహించి ఆరోగ్యం నిలకడగా ఉందని తెలిపారు. ఈ ఘటనకు సంబంధించి కాంట్రాక్టర్లపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కార్మికుల పట్ల జాగ్రత్తలు తీసుకోవడంలేదని ఆరోపిస్తున్నారు.

487 మెట్రిక్ టన్నుల ఇసుక సీజ్

బిక్కవోలు, జూలై 15(ఆంధ్రజ్యోతి): బలభద్రపురం శివారు కానేడులో బలభద్రపురానికి చెందిన దుర్గాప్రసాద్, మొండి వీరవెంకట అభినవ అక్రమంగా నిల్వ వుంచిన ఇసుకను జిల్లా మైనింగ్ అండ్ జియాలజీ ఆఫీసర్ డి.ఫణిభూషణరెడ్డి మంగళవారం సీజ్ చేశారు. ఇంటి నిర్మాణానికి ఇసుకను అక్రమంగా నిల్వ ఉంచడంతో ఫణిభూషణరెడ్డి సిబ్బందితో వచ్చి ఆధారాలు చూపమనగా, చూపకపోవడంతో 487 మెట్రిక్ టన్నుల ఇసుకను సీజ్ చేసి బిక్కవోలు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో ఎస్ఐ వి.రవిచంద్రకుమార్ కేసు నమోదు చేశారు.

కేసుల పరిశీలనపై సూచనలు

జిల్లా అడాల్డ్ ట్రయల్ రెఫర్మ్ కమిటీ మీటింగ్ నిర్వహించిన ఉమ్మడి జిల్లా జడ్జి సునీత



సమావేశం నిర్వహిస్తున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి సునీత

రాజమహేంద్రవరం సిటీ, జూలై 15(ఆంధ్రజ్యోతి): జిల్లా అడాల్డ్ ట్రయల్ రిఫర్మ్ కమిటీ, ఎగ్జిక్యూటివ్ బోర్డు మీటింగ్‌ను ఉమ్మడి జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ(డీఎల్ఎస్ఏ) చైర్మన్ గంధం సునీత నిర్వహించారు. మంగళవారం జిల్లా కోర్టు ప్రాంగణంలో న్యాయమూర్తి కార్యాలయంలో జరిగిన సమావేశంలో విద్యార్థుల్లో ఉన్న క్రిమినల్ కేసుల పరిశీలన, డ్రగ్స్, పెయిడ్ బైల్ కేసుల విషయంలో పోలీసు అధికారులకు పలు సూచనలు చేశారు. టీనేజ్/జ్యూవనైల్ విషయాల్లో డ్రగ్స్ ఎఫెక్ట్స్ ఎదుర య్యే సమస్యలపై తాత్కాలిక చట్టాల గురించి చర్చించారు. సంబంధిత అధికారులకు తగిన స్పష్టతను ఇచ్చారు. ఎగ్జిక్యూటివ్ బోర్డు మీటింగ్ సందర్భంలో డీఎల్ఎస్ఏ కార్యదర్శిపై బాధ్యతల పరిధులపైకూ లంకుషంగా చర్చలు జరిపారు. సమావేశంలో ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి ఎస్‌కే జోషి, డీఎల్ఎస్ఏ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఎన్.శ్రీలక్ష్మి, తూర్పుగోదావరి జిల్లా ఏపీపీ అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఎస్‌పీవీ సుబ్బరాజు, ఎస్‌బీడబ్ల్యూ క్లస్టర్ అధికారులు, కాకినాడ జిల్లా డీఎస్పీ మనీష్ దేవరాజ్ పాటిల్, డాక్టర్ ఎన్ఆర్‌కే అన్వేషణ, కోనసీమ జిల్లా అడిషనల్ ఎస్పీ బీఆర్‌బీటీ ప్రసాద్, అల్లూరి జిల్లా డీఎస్పీ జె.సాయి ప్రకాష్, జిల్లా చైల్డ్, సబ్ కంట్రోల్ ఆఫీసర్, ఉమ్మడి జిల్లా రెవెన్యూ శాఖ అధికారులు పాల్గొన్నారు.

కోర్ట్‌ను తప్పుదారి పట్టించిన ఇద్దరికి ఆరు నెలల జైలు

2005 నాటి కేసులో తీర్పు వెల్లడి.. నిందితులు విశాఖపట్నం వాసులు

రాజమహేంద్రవరం సిటీ, జూలై 15(ఆంధ్రజ్యోతి): ఏసీబీ కేసులో కోర్టును తప్పుదారి పట్టించిన ఇద్దరు వ్యక్తులకు ఆరునెలల జైలు శిక్ష విధిస్తూ రాజమహేంద్రవరం 3వ అదనపు ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టు న్యాయమూర్తి రమ్య చావలి తీర్పునిచ్చారు. వివరాల్లోకి వెళితే.. 2005లో విశాఖపట్నంలోని శాంతినగరానికి చెందిన సింగవరపు శ్రీనివాసరావు, పొడుగు శ్రీనివాస్‌ల ఫిర్యాదు మేరకు కాకినాడ జిల్లా సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ అసిస్టెంట్ డైరెక్టర్ బొల్లా ఈశ్వరరావుపై ఏసీబీ రాజమండ్రి వారు దర్యాప్తు చేపట్టారు. కేసు విచారణ సమయంలో ఫిర్యాదుదారులు ఇద్దరు తప్పుడు సాక్ష్యం చెప్పడాన్ని కోర్టు గుర్తించింది. ఈ మేరకు ఏసీబీ జడ్జి ఇచ్చిన ఆదేశాలతో ఈ కేసును 3వ అదనపు ఫస్ట్ క్లాస్ కోర్టులో నమోదు చేసి విచారణ జరుపగా నేరం రుజువు కావడంతో సింగవరపు శ్రీనివాసరావు, పొడుగు శ్రీనివాస్‌లకు ఆరు నెలల జైలు శిక్ష, ఐదువేల జరిమాన విధించారు. జరిమాన చెల్లించకపోతే మరో రెండు నెలల పాటు జైలు శిక్ష అనుభవించాలని న్యాయమూర్తి రమ్య చావాలి తీర్పును వెల్లడించారు. ఈ కేసులో ప్రాసిక్యూషన్‌ను ఏసీబీ డీఎస్పీ ఎం.కిశోర్‌కుమార్ పర్యవేక్షించారు.

కాకినాడ

• కాకినాడ సిటీ • రూరల్ • పిఠాపురం • పెద్దాపురం

గరుడ యాప్ వినియోగంపై బీఎల్వోలకు శిక్షణ

పెద్దాపురం, జూలై 15 (ఆంధ్రజ్యోతి): గరుడ యాప్ వినియోగంపై బూత్ లెవెల్ అధికారులు (బీఎల్వో)కు ఆర్డీవో కార్యాలయంలో మంగళవారం శిక్షణ ఇచ్చారు. ఈఆర్వో నెట్‌పై తహసీల్దారు సీహెచ్ వెంకటలక్ష్మి, డిప్యూటీ తహసీల్దారు కాంతారావు అవగాహన కల్పించారు. శిక్షణను ఆర్డీవో కె.శ్రీరమణి పర్యవేక్షించారు.



పిఠాపురంలో 1 కే వాక్ నిర్వహిస్తున్న జడ్జీలు, న్యాయవాదులు

జడ్జీలు, న్యాయవాదుల పాదయాత్ర

పిఠాపురం, జూలై 15 (ఆంధ్రజ్యోతి): మధ్యవర్తిత్వంపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు జడ్జీలు, న్యాయవాదులు పట్టణంలో మంగళవారం ఒక కిలోమీటరు పాదయాత్ర (1కే వాక్) నిర్వహించారు. 12వ అదనపు జిల్లా జడ్జి ఎం.శ్రీహరి మాట్లాడుతూ మధ్యవర్తిత్వం ద్వారా కేసులు సత్వరం పరిష్కారమవుతాయన్నారు. కక్షిదారులు మండల లీగల్ సర్వీసెస్ అథారిటీని సంప్రదించడం ద్వారా మధ్యవర్తిత్వం కోరవచ్చని చెప్పారు. కార్యక్రమంలో పిఠాపురం సీనియర్ సివిల్ జడ్జి ఎం.బాబు, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఎం.విజయ రామేశ్వరి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎం.రాజారావు, ఏపీపీ బత్తిన లక్ష్మణదొర, అనిశెట్టి కాశీవిశ్వనాథరెడ్డి, పలువురు న్యాయవాదులు, పారా లీగల్ వలంటీర్లు పాల్గొన్నారు.



లక్‌పతి దీదీ కార్యక్రమం ద్వారా మహిళలకు రుణాలు అందజేస్తున్న డీఆర్డీఏ పీడీ శ్రీనివాసరావు

'మహిళలు ఆర్థికంగా పురోగతి సాధించాలి'

గొల్లప్రోలు రూరల్, జూలై 15 (ఆంధ్రజ్యోతి): మహిళలు ప్రభుత్వం, బ్యాంకులు అందిస్తున్న రుణాలను వినియోగించుకుని ఆర్థికంగా పురోగతి సాధించాలని డీఆర్డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీనివాసరావు సూచించారు. గొల్లప్రోలు మండలం చేబ్రోలులోని ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకు (పూర్వ చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంకు) ఆవరణలో మంగళవారం జరిగిన రుణమేళాలో పాల్గొని లక్‌పతీ దీదీ కార్యక్రమం ద్వారా గొల్లప్రోలు, చేబ్రోలు బ్యాంకు శాఖల పరిధిలో 100 మంది మహిళలకు రూ.1.02 కోట్లు రుణాలు అందజేశారు. కార్యక్రమంలో బ్యాంకు రీజనల్ మేనేజరు గంటా శ్రీనివాసరావు, గొల్లప్రోలు, చేబ్రోలు శాఖల మేనేజర్లు సుధీర్, లక్ష్మీకాంత్, ఏపీఎం సన్యాసిరావు, స్టాఫ్ మేనేజరు ఎస్.శ్రీనివాస్, సీసీలు వెంకటరమణ, రాజకుమారి, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

23న పారా అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్
రాష్ట్ర స్థాయి ఎంపికలు

కార్పొరేషన్ (కాకినాడ), జూలై 15 (ఆంధ్రజ్యోతి): జిల్లా స్థాయి (దివ్యాంగ) సబ్-జూనియర్స్, జూనియర్స్ పారా అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో పాల్గొనేందుకు ఈ నెల 23న ఎంపికలు నిర్వహిస్తున్నట్టు పారా స్పోర్ట్స్ అసోసియేషన్ సెక్రటరీ వి.రామస్వామి మంగళవారం తెలిపారు. హర్యానాలో వచ్చే నెల 22, 23, 24 తేదీల్లో జాతీయ స్థాయి సబ్ జూనియర్, జూనియర్ పారా అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ జరగనుంది. దీని నిమిత్తం రాష్ట్ర స్థాయి క్రీడాకారుల ఎంపిక కాకినాడ జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 23న జిల్లా క్రీడా మైదానంలో ఎంపికలు జరుగుతాయి. జిల్లాలోని దివ్యాంగ క్రీడాకారులు ఈ నెల 20వ తేదీలోగా పేర్లు నమోదు చేసుకోవాలని, మరిన్ని వివరాలకు 9390131777, 9347117081 నెంబర్లలో సంప్రదించాలని రామస్వామి కోరారు.





కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు, కార్యకర్తలు, విద్యార్థులు.... మరో శిబిరంలో పెన్షనర్లు

ఇటు విద్యార్థులు, అటు పెన్షనర్లు

డిగ్రీ అడ్మిషన్లు ప్రారంభించాలని ఒకరు, సమస్యలు పరిష్కరించాలని మరొకరు కలెక్టరేట్ ఎదుట ధర్నా

కలెక్టరేట్ (కాకినాడ), జూలై 15 (ఆంధ్రజ్యోతి): డిగ్రీ అడ్మిషన్లు వెంటనే ప్రారంభించాలని, డిగ్రీలో ఉన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ భారత విద్యార్థి ఫెడరేషన్ కాకినాడ నగర కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి గంగా సూరిబాబు మాట్లాడుతూ సాధారణ డిగ్రీ విద్యలో ఉన్నత విద్యా మండలి తీసుకొస్తున్న మార్పులు విద్యార్థులను గందరగోళంలోకి నెడుతున్నాయన్నారు. డబుల్ మేజర్ విధానాన్ని ప్రకటించి ఆచరణలో దాని లాభనష్టాలను పరిశీలించకుండానే సింగిల్ మేజర్ విధానాన్ని కొనసాగించాలని నిర్ణయించడం దారుణమన్నారు. సింగిల్ మేజర్ విధానం ఇప్పటికే ఆచరణలో విఫలమైందన్నారు. ఇది విద్యార్థుల భవిష్యత్తుపై పెనుప్రభావం చూపుతుందన్నారు. విద్యా సంవత్సరం ప్రారంభమై నెల గడుస్తున్నా డిగ్రీ కళాశాలల్లో మొదటి సంవత్సరం ప్రవేశాలు ప్రారంభం కాలేదన్నారు. ప్రవేశాలు ఆన్‌లైన్‌లో ఉండటం వలన ఎక్కువ సీట్లు ఖాళీగా ఉండిపోతున్నాయన్నారు. దీనివల్ల కొన్ని ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ఆన్‌లైన్‌తో పాటు ఆఫ్‌లైన్‌లో కూడా ప్రవేశాలు కల్పించాలన్నారు. విద్యార్థులకు చదువుకు తగ్గట్టుగా ఇంటర్న్‌షిప్ ఇవ్వాలన్నారు. అనంతరం జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనాను కలిసి వినతిపత్రం ఇచ్చారు. ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు వాసుదేవ్, సీహెచ్ సాహిత్, కరుణ్, సత్య, తేజ, మహాలక్ష్మి, దీప్తి, అను తదితరులు పాల్గొన్నారు.

పెన్షనర్ల సమస్యలను, డిమాండ్లను తక్షణం పరిష్కరించాలని రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం కాకినాడ జిల్లా శాఖ ఆధ్వర్యంలో పెన్షనర్లు కలెక్టరేట్ ఎదుట ధర్నా చేశారు. సంఘం జిల్లా అధ్యక్షుడు వీరభద్రస్వామి, ప్రధాన కార్యదర్శి రామారావు మాట్లాడుతూ కేంద్రం, రాష్ట్రంలో వేతన కమిషన్‌ను వెంటనే నియమించి ఐఆర్ ప్రకటించాలని డిమాండ్ చేశారు. కాంప్రహెన్సివ్ హెల్త్ ఇన్సూరెన్స్ స్కీమ్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. రైల్వే, విమాన రాయితీలను పునరుద్ధరించాలని కోరారు. అపరిష్కృతంగా ఉన్న పెన్షనర్ల సమస్యలను పరిష్కరించాలని కోరారు. విశ్రాంత ఉద్యోగుల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. అనంతరం కలెక్టరేట్‌లో వినతిపత్రం ఇచ్చారు. ధర్నాకు ఏపీటీఆర్ఎస్ఏ రాష్ట్ర అధ్యక్షుడు పాము శ్రీనివాసరావు, జిల్లా అధ్యక్షుడు వాసంశెట్టి శశికుమార్, ఏపీ ఎన్జీవో సంఘ నాయకులు పసుపులేటి శ్రీనివాస్, వేపకాయల వెంకటకృష్ణ, మూర్తిబాబు, కాదా వెంకటరమణ, యూటీఎఫ్ నాయకులు మద్దతు పలికారు.

ఆరుగురు సభ్యులతో జిల్లా నాయీబ్రాహ్మణ స్టీరింగ్ కమిటీ



స్టీరింగ్ కమిటీ సభ్యులు, సన్మాన గ్రహీతలతో నాయీబ్రాహ్మణ సంఘ జిల్లా నాయకులు

కాకినాడ సిటీ, జూలై 15 (ఆంధ్రజ్యోతి): జిల్లా నాయీబ్రాహ్మణ సేవా సంఘం మూడేళ్ల పదవీకాలం పూర్తయినందున దానిని రద్దు చేస్తూ ఆరుగురు సభ్యులతో స్టీరింగ్ కమిటీని ఏర్పాటు చేశారు. కాకినాడ నగర నాయీబ్రాహ్మణ సేవా సంఘం కమ్యూనిటీ హాలులో మంగళవారం జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించారు. స్టీరింగ్ కమిటీ కన్వీనర్‌గా కింతాడ సత్యనారాయణ, సభ్యులుగా నల్లమిల్లి అర్జునకుమార్, సానిపల్లి శ్రీనివాస్, పేరూరి వీరరాఘవులు, తగరంపూడి వాసు, స్వయంభారపు భద్రరావులను నియమించారు. 50 ఏళ్లు నిండిన నాయీబ్రాహ్మణులకు పెన్షన్ పథకం అమలు చేయాలని, మున్సిపల్ ఎన్నికల్లో, చట్టసభల్లో అవకాశం కల్పించాలని కోరుతూ తీర్మానం చేశారు. గ్రామ, మండల స్థాయి సంఘ పెద్దలు పది మందిని సత్కరించారు. సంఘ జిల్లా మాజీ వర్కింగ్ ప్రెసిడెంట్ స్వయంభారపు శ్రీనివాసరావు, కాకినాడ నగర శాఖ అధ్యక్షుడు వేపాడ శ్రీనివాసరావు, ఉపాధ్యక్షుడు తెల్లగ్రాపు ఈశ్వరరావు, తగరంపూడి వాసు, పట్నాల చంద్రరావు, సిగటాపుల రామారావు, కాకినాడ చిన్నా, బందరు అప్పారావు, పొనకరపల్లి నరసింహ, పైన శ్రీనివాసరావు, కాకినాడ ప్రసాద్, మెలిపాక నాగబాబు, వెదురుపావులూరు నాని తదితరులు పాల్గొన్నారు.



ప్రారంభోత్సవంలో పాల్గొన్న మంత్రి నారాయణ, ఎమ్మెల్యే చినరాజప్ప

గడియార స్తంభం ప్రారంభం

సామర్లకోట, జూలై 15 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని స్టేషన్ సెంటర్లో గడియార స్తంభాన్ని మంత్రి పొంగూరు నారాయణ మంగళవారం రాత్రి ప్రారంభించి శిలా ఫలకాన్ని ఎమ్మెల్యే చినరాజప్పతో కలిసి ఆవిష్కరించారు. మున్సిపల్ కమిషనరు శ్రీవిద్య, టీడీపీ నాయకులు నిమ్మకాయల రంగనాగ్, అడబాల కుమారస్వామి, బడుగు శ్రీకాంత్, రాజా సూరిబాబురాజు, పాలకుర్తి శ్రీనుబాబు, గుమ్మళ్ళ రామకృష్ణ, బలుసు శ్రీనివాసు, యార్లగడ్డ రవిచంద్రప్రసాద్, కుర్రా నారాయణస్వామి తదితరులు పాల్గొన్నారు.

విరవాడలో వైద్య శిబిరం

పిఠాపురం రూరల్, జూలై 15 (ఆంధ్రజ్యోతి): పిఠాపురం మండలం విరవాడలో మంగళవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. దీనిని మాజీ ఎమ్మెల్యే ఎస్వీఎస్ఎన్ వర్మ ప్రారంభించి పరీక్షలు చేయించుకున్నారు. స్నేహ ఆసుపత్రి వైద్యులు డాక్టర్ కోలా రమ్య, కొత్తెం సంతోషలక్ష్మి పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకుడు కోలా రాజు తదితరులు పాల్గొన్నారు.

యువత నైపుణ్య దినోత్సవం

గొల్లప్రోలు, జూలై 15 (ఆంధ్రజ్యోతి): గొల్లప్రోలు జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో మంగళవారం ప్రపంచ యువత నైపుణ్య దినోత్సవం నిర్వహించారు. విద్యార్థినులకు అందం-ఆరోగ్యం, ఐటీ అంశాల్లో డ్రాయింగ్, క్విజ్ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. పాఠశాల హెచ్ఎం సీహెచ్ సూర్యప్రకాశరెడ్డి, ఐటీ, బ్యూటీ, వెల్‌నెస్ ఉపాధ్యాయురాలు డి.వాంగ్మయి, బి.భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.

తల్లిదండ్రుల సమావేశం

పిఠాపురం, జూలై 15 (ఆంధ్రజ్యోతి): మెగా పేరెంట్ టీచర్ మీటింగ్‌కు హాజరుకాని తల్లిదండ్రులతో పట్టణంలోని ఆర్ఆర్‌బీ హెచ్ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో మంగళవారం సమావేశం నిర్వహించారు. విద్యార్థుల ప్రగతిని వివరించారు. ప్రిన్సిపాల్ వి.కేశవరావు, అధ్యాపకులు స్వరాజ్యలక్ష్మి, మహ్మద్‌హుస్సేన్, కాశీవిశ్వనాథ్, ప్రవీణ్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌బీ పట్నం పీఏసీఎస్ అధ్యక్షుడిగా దొరబాబు



పెద్దాపురం, జూలై 15 (ఆంధ్రజ్యోతి): ఆర్‌బీ పట్నం పీఏసీఎస్ అధ్యక్షుడిగా గ్రామానికి చెందిన టీడీపీ నేత పెనుమర్తి దొరబాబు, సభ్యులుగా నల్లల శ్రీనివాస్, బత్రెడ్డి శ్రీను నియమితులయ్యారు. ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప, డీసీసీబీ చైర్మన్ తుమ్మల రామస్వామి (బాబు)కు వారు కృతజ్ఞతలు తెలిపారు.

పీఏసీఎస్‌ల అధ్యక్షులు వీరే

సామర్లకోట, జూలై 15 (ఆంధ్రజ్యోతి): సామర్లకోట పీఏసీఎస్ అధ్యక్షుడిగా పైల్ల శ్రీనివాసరావు, ఉండూరు పీఏసీఎస్ అధ్యక్షుడిగా బచ్చల వెంకటరమణ, జి.మేడపాడు పీఏసీఎస్ అధ్యక్షుడిగా పాలకుర్తి వీర భవన్నారాయణ (రవిబాబు), నవర పీఏసీఎస్ అధ్యక్షుడిగా నాగనబోయిన చంటిబాబులను నియమిస్తూ ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. వారిని ఎమ్మెల్యే చినరాజప్ప అభినందించారు.

రేపు వర్చువల్ విధానంలో ఉప తపాలా కార్యాలయం ప్రారంభం

కాకినాడ సిటీ, జూలై 15 (ఆంధ్రజ్యోతి): పెద్దాపురం మున్సిపల్ సెంటర్ వద్ద నూతనంగా ఉప తపాలా కార్యాలయాన్ని ఏర్పాటుచేశారు. దీనిని గురువారం ఉదయం పదకొండు గంటలకు వర్చువల్ విధానంలో కేంద్ర సమాచార, గ్రామీణాభివృద్ధి శాఖల సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ ప్రారంభిస్తారని కాకినాడ డివిజన్ పోస్టల్ సూపరింటెండెంట్ తెలిపారు.

విముక్తి కాలనీ వాసులకు వస్త్రాలు పంపిణీ

కాకినాడ సిటీ, జూలై 15 (ఆంధ్రజ్యోతి): లయన్స్ క్లబ్ పశ్చిమ గోదావరి జిల్లా మాజీ గవర్నర్ మాదిరెడ్డి బాబూజీరావు 80వ పుట్టిన రోజు సందర్భంగా మంగళవారం స్థానిక విముక్తి కాలనీ వాసులకు, పేదలకు వస్త్రదానం, అన్నదానం చేశారు. లయన్స్ క్లబ్ సఖి, కాకినాడ జిల్లా జర్నలిస్ట్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో లయన్స్ మాజీ గవర్నర్, లీడర్‌షిప్ సెంట్రల్ చైర్మన్ డాక్టర్ బాదం బాలకృష్ణ, లయన్స్ క్లబ్ సఖి సభ్యులు డి.సునీత, ఎన్.నాగలక్ష్మి, కె.విజయలక్ష్మి, సీహెచ్ సావిత్రి, లక్ష్మీకుమారి, జర్నలిస్ట్ అసోసియేషన్ సభ్యులు మంగా శివరామకృష్ణ, గునిపే శోభన్‌బాబు, యమదల రాజేష్, రాట్నాల శ్రీనివాస్, కొండబాబు తదితరులు పాల్గొన్నారు.





పిఠాపురం జగ్గయ్యచెరువు కాలనీలో పర్యటిస్తున్న మాజీ ఎమ్మెల్యే వర్మ, కాకినాడలో గర్భిణికి కానుకలు అందజేస్తున్న ఎమ్మెల్యే కొండబాబు

'ప్రజలకు అండగా కూటమి ప్రభుత్వం'

పిఠాపురం, జూలై 15 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు అన్ని వేళలా కూటమి ప్రభుత్వం అండగా నిలుస్తుందని పిఠాపురం మాజీ ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎస్వీఎస్ఎన్ వర్మ తెలిపారు. సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని జగ్గయ్యచెరువు కాలనీలో మంగళవారం ఇంటింటికీ వెళ్లి కూటమి ప్రభుత్వం సాధించిన విజయాలను వివరిస్తూ ప్రజలకు కరపత్రాలు అందజేశారు. టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కార్పొరేషన్ (కాకినాడ) (ఆంధ్రజ్యోతి): సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు మంగళవారం 8వ వార్డు రాజ్యలక్ష్మి నగర్‌లో పర్యటించారు. అంగన్వాడీ కార్యకర్తలకు ఇండక్షన్ స్టవ్స్, ప్రీస్కూల్ పిల్లలకు పిపి-1, పిపి-2 వర్క్‌బుక్స్ అందజేశారు. గర్భిణులకు సామూహిక సీమంతం నిర్వహించి కానుకలు అందజేశారు. వార్డు ఇన్‌చార్జి సీకోటి అప్పలకొండ, కార్యకర్తలు, సూపర్‌వైజర్ శ్రీగౌరి తదితరులు పాల్గొన్నారు.



తాళ్లరేవు మండలం సీతారామపురంలో ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే సుబ్బరాజు

కాకినాడ సిటీ (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే కొండబాబు 8, 43 డివిజన్లలో స్థానిక నాయకులతో కలిసి ఇంటింటికీ వెళ్లి కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరిస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. మాజీ మేయర్ సుంకర పావని, కాకినాడ మార్కెట్ కమిటీ చైర్మన్ బచ్చు శేఖర్, నాయకులు సీకోటి అప్పలకొండ, బొనేపల్లి శ్రీనివాస్, నీలకాయల సన్నీ, సాదే సత్తిబాబు, చొక్కా బాబూరావు, నరం శ్రీనివాసరావు, నమ్మి సత్యవాణి తదితరులు పాల్గొన్నారు.

తాళ్లరేవు (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వంతోనే సుపరిపాలన సాధ్యమని ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు అన్నారు. మంగళవారం ఆయన కోరింగ పంచాయతీ సీతారామపురంలో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. టీడీపీ నేతలు టేకుమూడి లక్ష్మణరావు, కట్టా త్రిమూర్తులు, వాడ్రేవు వీరబాబు, అత్తిలి బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల స్థలాల జాబితాలను పారదర్శకంగా రూపొందించాలి: ఆర్డీవో మల్లిబాబు

కాకినాడ సిటీ, జూలై 15 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం నిర్దేశించిన విధంగా గ్రామీణ ప్రాంతాల్లో 3 సెంట్లు, పట్టణ ప్రాంతాల్లో 2 సెంట్లు చొప్పున మంజూరు చేసేందుకు అర్హత కలిగిన లబ్ధిదారులను ఎంపిక చేసి ఇళ్ల స్థలాల జాబితాలను పారదర్శకంగా రూపొందించాలని కాకినాడ ఆర్డీవో ఎస్.మల్లిబాబు ఆదేశించారు. మంగళవారం ఆయన తన కార్యాలయంలో డివిజన్ పరిధిలోని తహసీల్దార్లు, కమిషనర్లతో సమీక్షించారు. ఆర్వోఆర్ కేసులు, నీటితీరువా వసూళ్లు, రేషన్ కార్డులు, పీజీఆర్ఎస్, రీ సర్వే దరఖాస్తులపై చర్యలు తీసుకోవాలన్నారు. అభ్యంతరం లేని భూముల క్రమబద్ధీకరణకు సంబంధించి గ్రామ, మండల స్థాయిల్లో రెవెన్యూ రికార్డుల నిర్వహణ సక్రమంగా ఉండాలన్నారు. ల్యాండ్, ఇతర అంశాలపై ఎప్పటికప్పుడు సమీక్షించి నిర్ణీత గడువులోగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సమావేశంలో ఆర్డీవో ఏవో డీబీఏ చైనులు, తహసీల్దార్లు వి.జితేంద్ర, పి.త్రినాథరావు, జీఆర్ ఠాగూర్, కె.చిన్నారావు, కె.సత్యనారాయణ, కె.చంద్రశేఖరరెడ్డి, డిప్యూటీ తహసీల్దార్లు ఎస్ఎల్ఎన్ కుమారి, కృష్ణ, దుర్గాప్రసాద్, సౌజన్య, పిఠాపురం మున్సిపల్ కమిషనరు కనకారావు, సిబ్బంది పాల్గొన్నారు.

తడి, పొడి చెత్త సేకరణపై అవగాహన

కరప, జూలై 15 (ఆంధ్రజ్యోతి): తడి, పొడి చెత్త సేకరణ సక్రమంగా చేపట్టాలని జడ్పీ సీఈవో వీవీవీఎస్ లక్ష్మణరావు సూచించారు. మంగళవారం ఆయన అరట్లకట్టలో పర్యటించి ఇంటింటా తడి, పొడి చెత్త సేకరణను పరిశీలించి పలు సూచనలు చేశారు. ప్రజలకు సరఫరా చేసే తాగునీటి నాణ్యత, సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలించారు. సీఈవో వెంట సర్పంచ్ సత్యవేణి, ఎంపీడీవో అనుపమ, డిప్యూటీ ఎంపీడీవో శ్రీనివాసరావు వున్నారు.

విద్యుత్ శాఖ ఏఈ బదిలీ

సామర్లకోట, జూలై 15(ఆంధ్రజ్యోతి): సామర్లకోట అర్బన్ విద్యుత్ ఏఈ రమేష్‌కుమార్‌ను అమలాపురం కనస్ట్రక్షన్ సెక్షన్ ఏఈగా బదిలీ చేస్తూ ఈపీడీసీఎల్ సీఎండీ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. 33 కేవీ లైన్లను నిబంధనలకు విరుద్ధంగా మార్చడంతో పాటు, అభివృద్ధి పనుల్లో ఆయనపై వచ్చిన ఆరోపణలతో ఉన్నతాధికారుల తుది నివేదికల ఆధారంగా రమేష్‌ను అకస్మికంగా బదిలీ చేసినట్టు సమాచారం. రూరల్ ఏఈ నాగేశ్వరరావుకు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు.

సామర్లకోట గోదావరి కాలువలో
గుర్రపుడెక్క అవరోధాలు తొలగింపు

సామర్లకోట, జూలై 15 (ఆంధ్రజ్యోతి): సామర్లకోట- కాకినాడ రోడ్డులో వీకే రాయపురం నుంచి మాధవపట్నం వరకు గోదావరి కాలువలో గుర్రపుడెక్క, తూటికాడలను పెద్ద ఎత్తున తొలగిస్తున్నారు. గత నాలుగు సీజన్లుగా వెంకటకృష్ణరాయపురం నుంచి మాధవపట్నం వరకు పంట పొలాల నుంచి మిగులు జలాలు ఏలేరు కాలువలో కలుస్తున్నారు. తద్వారా వర్షాకాలంలో పంట పొలాలు ముంపునకు గురవుతున్నాయి. కూటమి ప్రభుత్వం అధికా రంలోకి రాగానే వీకే రాయపురం, బోయినపూడి, మాధవపట్నం గ్రామాలకు చెందిన పలువురు రైతులు ఈ విషయాన్ని ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప దృష్టికి తీసుకెళ్లగా ఆయన ఇరిగేషన్ అధికారులతో చర్చించారు. ఈ నేపథ్యంలో వారి ఆదేశాల మేరకు గత రెండు రోజులుగా నిర్వహిస్తున్న పనుల కారణంగా ఎనిమిదేళ్లుగా పూడుకు పోయిన మురుగు కాలువ బహిర్గతమైంది.



ఎక్స్‌కవేటర్‌తో గుర్రపుడెక్క తొలగిస్తున్న దృశ్యం



ఎమ్మెల్యే నానాజీకి వినతిపత్రం ఇస్తున్న పాస్టర్ల సంఘం ప్రతినిధులు

'క్రైస్తవులకు శ్మశానవాటిక స్థలం కేటాయించాలి'

సర్పవరం జంక్షన్, జూలై 15 (ఆంధ్రజ్యోతి): క్రైస్తవులకు శ్మశానవాటిక కోసం స్థలం కేటాయించాలని క్రిస్టియన్ కౌన్సిల్ ఆఫ్ ఏపీ పాస్టర్ల బృందం ప్రతినిధులు కోరారు. క్రిస్టియన్ కౌన్సిల్ ఆఫ్ ఏపీ స్టేట్ ప్రెసిడెంట్ పాస్టర్ మోసా అబ్రహం ఆధ్వర్యంలో ప్రతినిధులు మంగళవారం గొడారిగుంటలో ఎమ్మెల్యే పంతం నానాజీని కలుసుకుని ఈ మేరకు వినతిపత్రం అందించారు. తూరంగి శివారు మహాలక్ష్మినగర్, పగడాలపేట ప్రాంతాల్లో శ్మశానవాటిక స్థలం కేటాయింపునకు చర్యలు తీసుకోవాలన్నారు. తూరంగి పంచాయతీ పరిధిలో అనువైన స్థలాన్ని కేటాయించేందుకు చర్యలు తీసుకుంటానని ఎమ్మెల్యే నానాజీ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సంఘ ప్రతినిధులు ఎస్.ప్రభాకర్, కె.మోజెస్, జాన్‌ప్రసాద్, సలగల విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



కేక్ కట్ చేస్తున్న బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు రమణ

'బీసీ కులగణనకు ఆద్యుడు శంకర్రావు'

కాకినాడ సిటీ, జూలై 15 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేశన శంకర్రావు 70వ పుట్టినరోజు వేడుకలను మంగళవారం దేవాలయం వీధిలోని సంఘ కార్యాలయంలో నిర్వహించారు. సంఘ జిల్లా అధ్యక్షుడు గుత్తుల రమణ కేక్ కట్ చేసి స్వీట్లు పంచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశవ్యాప్తంగా జనగణనతో పాటు బీసీ కులగణన జరగడానికి ఆద్యుడు శంకర్రావు అని కొనియాడారు. జిల్లా ప్రధాన కార్యదర్శి మన్నే నాగేశ్వరరావు, మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు బత్తుల భవానీ, నగర ప్రధాన కార్యదర్శి మల్లిపూడి శివాజీ, వంక మాలతి, దారపు శిరీష, ప్రసాద్, వి.చిన్ని, సీహెచ్ వెంకటరమణ, ఎన్.బాబ్జీ, కె.కృష్ణ, బి.సతీష్ తదితరులు పాల్గొన్నారు.

హరిహర క్షేత్రంలో శ్రీరుద్ర సహిత నవగ్రహ యాగం

సామర్లకోట, జూలై 15 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో గోదావరి తీరాన గల హరిహర క్షేత్రం అన్నపూర్ణా సమేత రామలింగేశ్వరాలయంలో శ్రీరుద్ర సహిత నవగ్రహ యాగం మంగళవారం వైభవంగా జరిగింది. యాగ నిర్వాహకుడు, ఆలయ వ్యవస్థాపకుడు పరమానందగిరి స్వామి, కార్యదర్శి బాలకానందగిరి స్వామి ఆధ్వర్యంలో విఘ్నేశ్వర పూజ, అంకురార్పణ, నవగ్రహ శాంతి హోమం, మంటపారాధన జరిగాయి. రామలింగేశ్వర స్వామి ఉత్సవమూర్తులకు గ్రామోత్సవం నిర్వహించారు. ఆలయ పండితులు పెండ్యాల సుబ్రహ్మణ్యం, మణికంఠ పూజలు జరపగా అధిక సంఖ్యలో భక్తులు తిలకించి ప్రసాదాలు స్వీకరించారు.



'అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలి'

గండేపల్లి, జూలై 15(ఆంధ్రజ్యోతి): అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని ఎంపీడీవో కె.చంద్రరావు అన్నారు. ఆయన మంగళవారం గండేపల్లి మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో నిర్వహించిన సర్వసభ్య సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈసందర్భంగా చంద్రరావు మాట్లాడుతూ పి4 పథకం ద్వారా అధికారులు, ప్రజాప్రతినిధులు గ్రామంలో కుటుంబాలను దత్తత తీసుకోవాలన్నారు. సమావేశంలో ఎంపీపీ చలగళ్ల దొరబాబు, తహసీల్దార్ శ్రీనివాస్, ఎంఈఓ నాయక్, ఏవో శ్రీరామ్, ఎలక్ట్రికల్ ఏఈ కిరణ్ కిషోర్, ఏపీవో కృష్ణంరాజు పాల్గొన్నారు.

రంపచోడవరం

• రంపచోడవరం • మారేడుమిల్లి • రాజవొమ్మంగి • అడ్డతీగల • వై రామవరం • గంగవరం • దేవీపట్నం • చింతూరు • కూనవరం • వీఆర్ పురం • ఎటపాక

'కూటమి పాలనతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యం'



రంపచోడవరంలో సుపరిపాలన కార్యక్రమంలో టీడీపీ నాయకులు

రంపచోడవరం, జూలై 15 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వ పాలనతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని టీడీపీ మాజీ మండలాధ్యక్షుడు అడబాల బాపిరాజు అన్నారు. సుపపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఆయన సిరిగిందలపాడులో కూటమి పాలనలో అమలు చేసిన పలు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలతో రూపొందించిన కరపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డు వైస్ ఛైర్మన్ సలాది బాపిరాజు, బూత్ ఇన్‌చార్జి పతివాడ రమణ, ఎస్వీ రమణకుమార్, చవలం బాపన్నదొర పాల్గొన్నారు.

చింతూరులో విస్తృతంగా 'సుపరిపాలన-తొలి అడుగు'



చింతూరులో సుపరిపాలన కరపత్రాలు అందిస్తున్న టీడీపీ నేతలు

చింతూరు, జూలై 15(ఆంధ్రజ్యోతి): సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమం చింతూరు మండలంలో విస్తృతంగా జరుగుతోంది. టీడీపీ మండల అధ్యక్షుడు ఇల్లా చిన్నారెడ్డి, క్లస్టర్ ఇన్‌ఛార్జి ఓబులునేని నర్సింహరావు నాయకులు జమాల్‌ఖాన్, ఎండీ జహంగీర్ నేతృత్వంలో ఇంటింటి పర్యటన జరుగుతోంది. ఇందులోభాగంగా ఏడాది పాలనలో కూటమి ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలు, చేపట్టనున్న కార్యక్రమాలను వివరిస్తున్నారు. మంగళవారం చింతూరు, బొడ్డుగూడెం తదితర గ్రామాల్లో కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు సురేష్ కుమార్, సాల్మన్‌రాజు పాల్గొన్నారు.

'తాగునీటి సమస్య పరిష్కరించాలి'

చింతూరు, జూలై 15(ఆంధ్రజ్యోతి): తాగునీటి సమస్యను పరిష్కరించాలని ఐద్వా మండల అధ్యక్షురాలు మడివి శ్రీదేవి డిమాండ్ చేశారు. కల్లేరులో ఐద్వా కమిటీ మంగళవారం పర్యటించింది. తాగునీటి సమస్యను తెలుసుకున్న ఐద్వా కమిటీ మహిళలతో కలిసి ఖాళీ బిందెలతో సచివాలయం వద్దకు చేరుకుని నిరసన వ్యక్తం చేశారు. కల్లేరులో అంతర్గత రహదారులు లేక ప్రజలు అవస్థలు పడుతున్నారన్నారు. కార్యక్రమంలో మహిళా సంఘం మండల కమిటీ సభ్యురాలు సోడి చిన్నమ్మి, సోడి రాములమ్మ, కమలమ్మ పాల్గొన్నారు.

'మహిళా సంఘాలకు తోడ్పాటు అందించాలి'

రంపచోడవరం, జూలై 15 (ఆంధ్రజ్యోతి): ఏజెన్సీలోని మహిళా స్వయం సహాయక సంఘాలు ఆర్థికంగా అభివృద్ధి చేందేలా తోడ్పాటు అందించాలని ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం అన్నారు. ఐటీడీఏ కార్యాలయంలో ఆయన రంపచోడవరం, చింతూరు డివిజన్లలోని వెలుగు అధికారులు, సిబ్బందితో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పీవో మాట్లాడుతూ మహిళా స్వయం సహాయక సంఘాలు ఆర్థికంగా అభివృద్ధి చెందేలా జీవనోపాధి కల్పించాలన్నారు. విధుల నిర్వహణలో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఏపీడీ దేగలయ్య, డీపీఎంలు అపర్ణ, పరమేశ్వరరావు, ఏపీఎంలు, సీసీలు, అకౌంటెంట్లు, ఎల్‌సీలు పాల్గొన్నారు.

నేడు గిరిజన చట్టాలపై అభిప్రాయ సేకరణ

రంపచోడవరం, జూలై 15(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర గిరిజన సంక్షేమశాఖ డైరెక్టర్ ఎస్.భార్గవి ఆధ్వర్యంలో జీవో నెం.3, గిరిజన చట్టాలపై బుధవారం అభిప్రాయ సేకరణ నిర్వహిస్తున్నట్టు ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం తెలిపారు. గిరిజన సంక్షేమశాఖ డైరెక్టర్ ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంటన్నర వరకు సమీక్ష సమావేశం నిర్వహిస్తారని, గిరిజన, ఉపాధ్యా సంఘాల నాయకులు, ఎన్జీవోలు, న్యాయవాదులు అభిప్రాయలు తెలపాలన్నారు.

నేడు స్మార్ట్ విద్యుత్ మీటర్లను వ్యతిరేకిస్తూ సమావేశం

రంపచోడవరం, జూలై 15(ఆంధ్రజ్యోతి): స్మార్ట్ విద్యుత్ మీటర్లను వ్యతిరేకిస్తూ ప్రజా, ఆదివాసీ సంఘాల వేదిక ఆధ్వర్యంలో మార్క్స్-ఎంగెల్స్ భవనంలో బుధవారం రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహిస్తున్నట్టు అఖిల భారతరైతు కూలీ సంఘం ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పల్లాల లచ్చిరెడ్డి, కుంజా దూలయ్య తెలిపారు. సమావేశానికి అఖిలపక్ష, ప్రజా, ఆదివాసీ విద్యావంతులు హాజరై సలహాలు, సూచనలు తెలుపాలన్నారు.

పాఠశాలల సమీపంలోని షాపుల్లో తనిఖీలు

రంపచోడవరం, జూలై 15(ఆంధ్రజ్యోతి): రంపచోడవరం, బోర్నగూడెం, పెదగెద్దాడ గ్రామాల్లో పాఠశాలలు, కళాశాలలకు సమీపంలో గుట్కా, పొగాకు ఉత్పత్తులు విక్రయిస్తున్న కిరాణా షాపులపై మంగళవారం తనిఖీలు నిర్వహించినట్టు సీఐ రవికుమార్ తెలిపారు. విక్రయిస్తున్న ఏడుగురికి ఒక్కొక్కరికి రూ.200 చొప్పున అపరాధ రుసుము విధించామన్నారు.

దేవీపట్నం భూముల సమస్యలు పరిష్కరిస్తాం

పోలవరం ప్రాజెక్టు అడ్మినిస్ట్రేటర్

దేవీపట్నం, జూలై 15(ఆంధ్రజ్యోతి):పోలవరం ప్రాజెక్టులో సర్వం కోల్పోయి మైదాన ప్రాంతాల్లో అద్దెకు ఇళ్లల్లో నివసిస్తున్న దేవీపట్నం గ్రామానికి సంబంధించిన నిర్వాసితుల సమస్యలు త్వరలోనే పరిష్కరిస్తామని పోలవరం అడ్మినిస్ట్రేటర్ అభిషేక్ తెలిపారు. దేవీపట్నం సర్పంచ్ కుంజం రాజామణి, గేదెల పెద్ద సుబ్బారావు, లంక హరిశ్చంద్రుడు, మరికొంతమంది నిర్వాసితులు ఆధ్వర్యంలో మంగళవారం ధవళేశ్వరం భూసేకరణ కార్యాలయానికి వెళ్లి ఆయనకు 44 గ్రామాల నిర్వాసితుల సమస్యలపై వినతిపత్రం అందజేశారు. 2013 భూసేకరణ చట్టం ప్రకారం 18ఏళ్లు నిండిన ప్రతిఒక్కరికీ ఆర్అండ్ఆర్ ప్యాకేజీ ఇవ్వాలన్నారు. అడ్మినిస్ట్రేటర్ అభిషేక్ మాట్లాడుతూ దేవీపట్నం తొమ్మిది ఎకరాల పొలం కోర్టులో ఉందని భూమిపై రైతుస్టే తీసుకొచ్చారని, రెండు నెలల వ్యవధిలో స్టేని ఎత్తి వేసేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. సిద్ద నారాయణస్వామి, తిరుమలశెట్టి శారదమ్మ, నారాయణస్వామి, ఈశ్వరమ్మ, కర్రి రెడ్డి, రామకృష్ణ, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

తాగునీటికి ప్రజల ఇక్కట్లు

దేవీపట్నం, జూలై 15(ఆంధ్రజ్యోతి): మండలంలో ప్రజలకు నిత్యం అవసరమయ్యే తాగునీరు వారంరోజులుగా అందుబాటులో లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. పురుషోత్తపట్నం శ్రీసత్యసాయి మంచినీటి పథకం ప్రాజెక్టు ద్వారా మంచినీళ్లు దేవీపట్నంతోపాటు గోకవరం, కోరుకొండ, సీతానగరం, రాజానగరం మండలాలకు ఇబ్బంది లేకుండా అందేవి. సత్యసాయి కార్మికులకు గతప్రభుత్వం 18నెలల జీతాలు ఇవ్వకుండా కార్మికులతో పనిచేయించుకుంది. కూటమి ప్రభుత్వం వచ్చి ఏడాది గడిచింది. 6నుంచి 8నెలల వరకు కార్మికులకు జీతాలు అకౌంట్‌లో జమ చేశారు. కాంట్రాక్టర్ నిర్లక్ష్యంవల్ల సంస్థలో పనిచేసే కార్మికులు 19నెలలుగా జీతాలు అందక సమ్మె బాటపట్టారు. దీంతో ప్రజలు నీళ్ల కోసం వాటర్ ప్లాంట్లు వద్ద క్యూకడుతున్నారు. ప్రభుత్వం స్పందించి సత్యసాయి కార్మికుల సమస్యలు పరిష్కారం చేసి తాగునీరు ఇప్పించేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

రెగ్యులర్ ఉపాధ్యాయుడిని నియమించండి

కూనవరం, జూలై 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని ముల్లూరులో పాఠశాలకు రెగ్యులర్ ఉపాధ్యాయుడిని నియమించాలని సర్పంచ్ బొగ్గ వెంకమ్మ ఇన్‌చార్జి ఎంపీడీవో జగన్నాథరావుకు వినతిపత్రం అందజేశారు. రెండేళ్లుగా ఈ పాఠశాలకు రెగ్యులర్ ఉపాధ్యాయులు లేరని విద్యార్థులకు సరైన విద్య అందడం లేదన్నారు. కాంట్రాక్టు టీచర్లతోనే పాఠశాల కొనసాగిస్తున్నామన్నారు. కార్యక్రమంలో పాఠశాల విద్యా కమిటీ ఛైర్మన్ సోడే నాగేశ్వరరావు, మాజీ ఎంపీటీసీ మేకల నాగేశ్వరరావు, శీలం ప్రసాద్, సేలం జ్యోతి, పైదా బొజ్జికుమారి, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

జగ్గంపేట

• జగ్గంపేట • తుని • ప్రత్తిపాడు

ప్రజలకు మేలు చేసే ప్రభుత్వం మాది

● జగ్గంపేటలో మంత్రి నారాయణ

జగ్గంపేట, జూలై 15 (ఆంధ్రజ్యోతి):జగ్గంపేటలో కూటమి ప్రభుత్వం ఏడాది సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ ఆధ్వర్యంలో జిల్లా టీడీపీ అధ్యక్షుడు నవీన్‌కుమార్ నేతృత్వంలో నిర్వహించిన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమానికి రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖామంత్రి, జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి పొంగూరి నారాయణ ముఖ్యఅతిథిగా హాజరై ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఏడాదిలో కూటమి ప్రభుత్వం అమలుచేసిన సంక్షేమం అభివృద్ధిని వివరిస్తూ ప్రజా సమస్యలు తెలుసుకుంటూ డోర్ టూ డోర్ తిరిగారు. ఈ సందర్భంగా మంత్రి నారాయణ, ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ద్వారానే మెరుగైన పాలన సాధ్యమని, ప్రభుత్వం ఏర్పడి సంవత్సర కాలంలోనే పేద ప్రజలకు సంక్షేమాన్ని అందిస్తూ అభివృద్ధి పథంలో రాష్ట్రప్రభుత్వం పయనిస్తుందని సీఎం చంద్రబాబు అనునిత్యం ప్రజా సంక్షేమం కోసం పాటుపడుతున్నారని మంత్రి నారాయణ పేర్కొన్నారు. జగ్గంపేట శెట్టిబలిజపేటలో పర్యటించి ప్రజా సమస్యలను ఏడాది పాలనపై ప్రజల అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. దీర్ఘకాలిక ప్రణాళికలతో అనుభవజ్ఞుడైన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రాష్ట్రాన్ని అభివృద్ధి వైపు ముందుకు తీసుకెళుతున్నారన్నారు. ప్రజల అభిప్రాయాలను మై టీడీపీ యాప్‌లో పొందుపరిచారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ ఛైర్మన్ అడపా భరత్ కుమార్, ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ కొత్త కొండబాబు, ప్రాజెక్టు కమిటీ ఛైర్మన్‌లు అడబాల భాస్కరరావు, బస్వా వీరబాబు, ఉంగరాల రాము, రాష్ట్ర టీడీ పీ కార్యదర్శులు ఎస్వీఎస్ అప్పలరాజు, కోర్పు లచ్చయ్యదొర, మండల టీడీపీ అధ్యక్షులు మారిశెట్టి భద్రం, పోతుల మోహన్‌రావు, చదరం చంటిబాబు, జగ్గంపేట టౌన్ అధ్యక్షుడు పాండ్రంగి రాంబాబు, సొసైటీ ఛైర్మన్లు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పలువురు కూటమి నాయకులు పాల్గొన్నారు.



సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న మంత్రి నారాయణ, ఎమ్మెల్యే నెహ్రూ

మంత్రి కార్యక్రమానికి తరలివెళ్లిన కూటమి నాయకులు

గండేపల్లి: మంత్రి నారాయణ మంగళవారం జగ్గంపేటలో ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ, టీడీపీ జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఏడాది సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రాష్ట్రమంత్రి నారాయణ హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో పాల్గొనేందుకు గండేపల్లి నుంచి టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కోర్పు లచ్చయ్యదొర, మండల పార్టీ అధ్యక్షుడు పోతుల మోహనరావు, నాయకులు జాస్తి వసంత్, కందుల చిట్టిబాబు, కేతిన వెంకన్నచౌదరి, సొసైటీ అధ్యక్షుడు కంటిపూడి సత్యనారాయణ, రాజు, ఆళ్ల సత్తిబాబు వెళ్లారు.

80శాతం సబ్సిడీపై డ్రోన్లు సరఫరా

ప్రత్తిపాడు, జూలై 15 (ఆంధ్రజ్యోతి):80శాతం సబ్సిడీపై రైతులకు డ్రోన్‌లు సరఫరా ప్రభుత్వం చేపట్టిందని వ్యవసాయశాఖ జగ్గంపేట డివిజన్ ఏడీఏ శ్రీనివాస్ చెప్పారు. మండలంలోని పెద్దిపాలెంలో మంగళవారం నిర్వహించిన రైతుల సమావేశానికి ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఏడీఏ మాట్లాడుతూ రూ.10లక్షలు విలువచేసే డ్రోన్‌కు సంబంధించి రూ.2లక్ష రైతు వాటాగా భరిస్తే 80శాతం సబ్సిడీతో డ్రోన్‌లు అందిస్తామన్నారు. వ్యవసాయరంగంలో డ్రోన్ల పాత్ర కీలకంగా మారడంవల్ల రైతులు ఈ సదావకాశాన్ని వినియోగించుకోవాలన్నారు. మండల వ్యవసాయా ధికారి జోకా అమృత మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్‌లో నాటు వేసుకునే ముందు మొదటిగా పోటాష్, సూపర్ ఎరువులు వేసుకోవాలని సూచించారు. ఉద్యాన అధికారి కె.దివ్యశ్రీ, వ్యవసాయ, ఉద్యానశాఖ సిబ్బంది రైతులు పాల్గొన్నారు.

డొక్కా సీతమ్మ క్యాంటీన్‌లో అన్నదానం

జగ్గంపేట, జూలై 15 (ఆంధ్రజ్యోతి):జగ్గంపేట పట్టణంలో పాత పోలీస్‌స్టేషన్ ఆవరణలో జగ్గంపేట జనసేన పార్టీ ఇన్‌చార్జ్,తుమ్మలపల్లి సత్యనారాయణ భూపతి చారిటబుల్ ట్రస్ట్ ఛైర్మన్ తుమ్మలపల్లి రమేష్ ఆధ్వర్యంలో అన్నదానం కార్యక్రమంలో పేదలకు భోజనాలు వడ్డించారు. తుమ్మలపల్లి రమేష్ మాట్లాడుతూ మా నాయకుడు పవన్‌కల్యాన్ స్ఫూర్తితో నిర్వహిస్తున్నామని తెలిపారు.

అమ్మమీద ప్రేమ మొక్క మీద చూపించాలి

● ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ

జగ్గంపేట, జూలై 15 (ఆంధ్రజ్యోతి):భారత ప్రభుత్వం మై భారత్ కాకినాడజిల్లా వారి సహ కారంతో మణికర్ణికర్ణిక యువజన సంఘం ఆధ్వ ర్యంలో ఏక్ పేడ్ మాకే నామ్ కార్యక్రమంలో స్థానిక గోకవరం రోడ్‌లోని జగ్గంపేట ప్రభుత్వ మోడల్ డిగ్రీకళాశాలలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ ము ఖ్య అతిథిగా హాజరై మొక్కలు నాటారు. ఎమ్మె ల్యే మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోదీ పిలుపు మేరకు భారతదేశం అంతా తల్లిపేరు మీ ద మొక్కనాటే కార్యక్రమం జరుగుతుందని ఆంధ్రప్రదేశ్‌లో వినూత్నంగా ఈ కార్యక్రమం జరుగుతుందని యువత అంతా అమ్మ మీద చూపించే ప్రేమ ఈమొక్క మీద చూపించాలని, భవిష్యత్ తరాలకు కలుషితం లేని పర్యావరణాన్ని అందించాలన్నారు. టీం మణికర్ణిక నిస్వార్థంగా చేసే సేవా కార్యక్రమాలను అభినందించారు. మణికర్ణిక యువజన సంఘ అధ్యక్షుడు గున్నాబత్తుల పూజా అనూష మాట్లాడుతూ సృష్టికి మూలం అమ్మ. పర్యావరణ పరిరక్షణ కూడా అమ్మతోనే సాధ్యం అన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ చెన్నారావు మాట్లాడుతూ పచ్చని చెట్లు ప్రగతికి మెట్లు అని విద్యార్థులంతా పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలన్నారు. అనంతరం పర్యావరణ పరిరక్షణపై వ్యాసరచన పోటీలలో విజేతలకు గవర్నమెంట్ ఆఫ్ ఇండియా సర్టిఫికెట్, మెమోంటోను ఎమ్మెల్యే అందజేశారు. కార్యక్రమంలో ఎండీవో ఏవీ ఎస్.చంద్రశేఖర్, టీడీపీ నాయకులు ఎస్వీఎస్ అప్పలరాజు, మారిశెట్టి భద్రం, టీం మణికర్ణిక ఉప అధ్యక్షులు శ్రీనివాస్, టీంసభ్యులు వీరబాబు, చిక్కాల మణికంఠ, రమే ష్, స్వామి, నాని, మణికంఠ, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే నెహ్రూకు శాలువా కప్పి జ్ఞాపికను అందజేస్తున్న దృశ్యం

పచ్చదనం పెంపొందించేందుకు కృషిచేయాలి

అన్నవరం: పచ్చదనం పెంపొందించేందుకు ప్రతిఒక్కరూ కృషిచేయాలని రాష్ట్ర లోకేష్ జనశక్తి ఫౌండేషన్ అధ్యక్షుడు చదరం తులసీరామ్ పేర్కొన్నారు. మంగళవారం ఆయన గ్రామంలో మొక్కలు నాటడంతోపాటుగా విభిన్న ప్రతిబావంతుల పాఠశాల విద్యార్థులకు ఆహారపదార్థాలు అందజేశారు. కార్యక్రమంలో అన్నవరం మాజీసర్పంచ్ మెరపల నరసయ్య, మెగలల్లూరు సత్యనారాయణ, సూరెడ్డి కల్యాణ్‌కుమార్, సర్పవరపు కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఆదిత్య అసిస్టెంట్ ప్రొఫెసర్ సురేష్‌కు డాక్టరేట్



గండేపల్లి, జూలై 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని సూరంపాలెం ఆదిత్య యూనివర్శిటీ మేనేజ్‌మెంట్ స్టడీస్ విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న సురేష్ పర్ల ఆదికవి నన్నయ యూనివర్శిటీ రాజమహేంద్రవరం నుంచి డాక్టరేట్ సాధించినట్లు ఆదిత్య యూనివర్శిటీ ప్రో ఛాన్సలర్ డాక్టర్ నల్లమిల్లి సతీష్‌రెడ్డి తెలిపారు. నన్నయ యూనివర్శిటీ ప్రొఫెసర్ డాక్టర్ పి.ఉమామహేశ్వరిదేవి నేతృత్వం లో సురేష్ సమర్పించిన థీసిస్ ఏ స్టడీ ఆన్ ఫైనాన్సింగ్ ఛాలెంజెస్ ఆఫ్ మైక్రో, స్మాల్ అండ్ మీడి యం ఎంటర్‌ప్రైజెస్ విత్ రిఫరెన్స్ టు సెలెక్ట్ డిస్ట్రిక్ట్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ అనే అంశంపై డాక్టర్ ఆఫ్ ఫిలాసఫీ పొందారని తెలిపారు. ఈసందర్భంగా ఆయనను ఛాన్సలర్ డాక్టర్ ఎన్.శేషారెడ్డి, డిప్యూటీ ప్రో ఛాన్సలర్ డాక్టర్ ఎం.శ్రీనివాసరెడ్డి, వైస్ ఛాన్సలర్ ప్రొ ఎంబీ శ్రీనివాస్ అభినందించారు.

ప్రత్తిపాడు నియోజకవర్గంలో పీఏసీఎస్‌లకు నూతన అధ్యక్షుల నియామకం

ప్రత్తిపాడు, జూలై 15 (ఆంధ్రజ్యోతి):ప్రత్తిపాడు నియోజకవర్గంలో 5 ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలకు నూతన అధ్యక్షులతోపాటు సభ్యులను ప్రకటిస్తూ ప్రకటిస్తూ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. రాష్ట్ర అగ్రికల్చరల్ కో ఆపరేటివ్ శాఖ చీఫ్ సెక్రటరీ బి.రాజశేఖర్ మంగళవారం ఉత్తర్వులు ఆయా సొసైటీలకు అందాయి. ప్రత్తిపాడు మండలం ఒమ్మంగి పీఏసీఎస్‌కు అధ్యక్షుడిగా సత్యంశెట్టి సీతారాం, లంపకలోవ పీఏసీఎస్ అధ్యక్షుడిగా వరుపుల రామకృష్ణ, కత్తిపూడి పీఏసీఎస్ అధ్యక్షుడి గాగాబు కృష్ణమూర్తి, ఏలేశ్వరం సొసైటీ అధ్యక్షుడిగా సూతి అప్పలరాజు, శంఖవరం సొసైటీ అధక్షుడు పర్వత వెంకట సత్యనారాయణలు నియమితులయ్యారు. అలాగే ఈ ఐదు సొసైటీలకు మరో 10 సభ్యులుగా నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సత్యప్రభ మాట్లాడుతూ ఎన్డీయే కూటమిలో 3 పార్టీలకు ప్రాతినిధ్యం కల్పిస్తూ నూతన కార్యవర్గ సభ్యులను ఎంపిక చేసినట్లు తెలిపారు. సొసైటీల నూతన పాలక అధ్యక్షులు, సభ్యులకు ఎమ్మెల్యే శుభాకాంక్షలు తెలిపారు.

'బూత్ లెవెల్ అధికారులు సమర్థవంతంగా కృషి చేయాలి'

ప్రత్తిపాడు, జూలై 15 (ఆంధ్రజ్యోతి):బూత్ లెవెల్ అధికారులు ఎన్నికలకు సంబంధించిన కార్యక్రమాల్లో సమర్థవంతంగా సేవలు అందించాలని ప్రత్తిపాడు నియోజకవర్గ ప్రత్యేక అధికారి, జిల్లా బీసీ కార్పొరేషన్ ఈడీ శ్రీనివాసరావు, తహసీల్దార్ ఎం.సూర్యప్రభలు చెప్పారు. స్థానిక జిల్లా పరిషత్ కార్యాలయంలో మండలంలోని బూత్ లెవెల్ అధికారులకు రెండు రోజులు నిర్వహించిన శిక్షణ కార్యక్రమాలు మంగళవారం సాయంత్రంతో ముగిశాయి. శిక్షణ పొందిన బూత్ లెవెల్ అధికారులకు ఈడీ శ్రీనివాసరావు, తహసీల్దార్ సూర్యప్రభలు ధ్రువపత్రాలు అందజేశారు. వారు మాట్లాడుతూ ఓటర్ల నమోదుతో పాటు పోలింగ్ కేంద్రాల పరిస్థితులు, ఓటర్ల జాబితాల సవరణలు తదితర అంశాల్లో బూత్ లెవెల్ అధికారులు కీలకంగా వ్యవహరించారన్నారు.

ఎస్.అన్నవరం పీఏసీఎస్ ఛైర్మన్‌గా రామలింగేశ్వరరావు



తునిరూరల్, జూలై 15(ఆంధ్రజ్యోతి): టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యులు యనమల రామకృష్ణుడు, ఎమ్మెల్యే యనమల దివ్య సిఫార్సుతో ఎస్.అన్నవరం పీఏసీఎస్ అధ్యక్షుడిగా అదే గ్రామానికి చెందిన పోలిశెట్టిరామలింగేశ్వరరావు నియమితులయ్యారు. ఆయనను టీడీపీ యువ నాయకులు యనమల రాజేష్, టీడీపీ మండల అధ్యక్షుడు చింతమనీడి అబ్బాయి, నియోజకవర్గంలోని పలువురు నాయకులు అభినందించారు. ఈసందర్భంగా రామలింగేశ్వరరావు మాట్లాడుతూ రైతు శ్రేయస్సు లక్ష్యంగా పనిచేస్తానని, యనమల రామకృష్ణుడు, ఎమ్మెల్యే దివ్య తనపై ఉంచిన నమ్మకాన్నినిలబెట్టుకుంటానన్నారు.

కొనసాగిన సంస్థాన సత్రం భూముల వేలం

తొండంగి, జూలై 15(ఆంధ్రజ్యోతి): పిఠాపురం శ్రీసంస్థాన సత్రం భూముల కౌలు వేలం పాటలు రెండో రోజు మంగళవారం నిర్వహించారు. 63.21 ఎకరాలను 30బిట్లుగా విభజించి కౌలు వేలం నిర్వహించగా రూ.6,02,700కు 30మంది రైతులు కౌలు దక్కించుకున్నారు. గతంలో ఇదే విస్తీర్ణం రూ.5,66,200కు వెళ్లింది. ఈఏడాది అదనంగా రూ.36,500 వచ్చింది. ఈవో శ్రీరాములు, పర్యవేక్షణాధికారి వీరభద్రరావు, ఫణి కుమార్, వడ్డి శ్రీనివాసరావు, రమణి తదితర అధికారుల సమక్షంలో పాటలు జరిగాయి. తొండంగి పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

'కార్మికులపై అశ్రద్ధ తగదు'

తునిరూరల్, జూలై 15(ఆంధ్రజ్యోతి): పోలవరం పనుల్లో భాగంగా తుని పరిసర ప్రాంతాల్లో జరుగుతున్న పనుల్లో పాల్గొంటున్న కార్మికుల పట్ల నిర్వాహకులు సేఫ్టీ నిబంధనలు పాటించాలని సీఐటీయూ తుని అధ్యక్షుడు నక్కెళ్ల శ్రీనివాస్ డిమాండ్ చేశారు. తుని వద్ద ఘటనపై ఆయన దిగ్భ్రాంతి వ్యక్తం చేసి ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా సంబంధిత కాంట్రాక్టర్లు చొరవ తీసుకోవాలని కోరారు.

తపోవనంలో తెలంగాణ మంత్రి పూజలు

తునిరూరల్, జూలై 15(ఆంధ్రజ్యోతి): ప్రముఖ ఆధ్యాత్మిక పీఠం తపోవన క్షేత్రంలో తెలంగాణ రాష్ట్రం ఎస్సీ, ఎస్టీ సోషల్ వెల్ఫేర్ మంత్రి ఎ.లక్ష్మణకుమార్ ప్రత్యేక పూజలు చేశారు. మంగళవారం ఆయన కుటుంబ సభ్యులతో తపోవనం క్షేత్రానికి చేరుకుని దేవతామూర్తుల ఆలయాన్ని సందర్శించి దర్శించారు. పీఠాధిపతులు శ్రీసచ్చితానంద సరస్వతి స్వామీజీ ఆశీర్వచనాలు పొందారు.

సొసైటీ అధ్యక్షులుగా పర్వత, గాబు



పర్వత, గాబు

శంఖవరం, జూలై 15(ఆంధ్రజ్యోతి): శంఖవరం, కత్తిపూడి సొసైటీలకు అధ్యక్షులను నియమించారు. కత్తిపూడి సొసైటీ అధ్యక్షుడిగా గాబు కృష్ణమూర్తి, శంఖవరం సొసైటీ అధ్యక్షుడిగా పర్వత వెంకట సత్యనారాయణను నియమించారు. సభ్యులుగా గుం ద్రాజు సత్యనారాయణ, పల్లా అర్జిబాబు, సర్నం జయబాబు, పెట్టాం సత్తిబాబును నియమించారు. ఈమేరకు ప్రభుత్వం బుధవారం జీవో విడుదల చేసింది.

ఎంపీడీవోగా సాయినవీన్ బాధ్యతల స్వీకరణ

తొండంగి, జూలై 15(ఆంధ్రజ్యోతి): తొండంగి ఎంపీడీవోగా మంగళవారం తుని ఎంపీడీవో సాయి నవీన్ బాధ్యతలు స్వీకరించారు. తొండంగి ఎంపీడీవో రాజేశ్వరరావు సస్పెండ్ అయిన నేపథ్యంలో ఆయన స్థానంలో సాయినవీన్ కు పూర్తి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో సాయి నవీన్ ఎంపీడీవో కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. గ్రామ కార్యదర్శులు రాజబాబు, ప్రేమ్‌కుమార్, రాము తదితరులు ఆయనను కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

ప్రజా సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యం

● ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ

● పలుచోట్ల 'సుపరిపాలన' కార్యక్రమాలు

రౌతులపూడి, జూలై 15(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలు పరిష్కారమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ అన్నారు. మండపం గ్రామంలో మంగళవారం సుపరిపాలన తొలిఅడుగు కార్యక్ర మాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే సత్యప్రభ ముఖ్య అతిథిగా విచ్చేశారు. గ్రామంలో ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలు వివరించారు. సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రత్తిపాడు నియోజవర్గం గ్రామాల్లో ప్రతి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నేత పర్వత సురేష్, ప్రత్తిపాడు మార్కెట్ కమిటీ ఛైర్మన్ బద్ది మణిరామారావు, టీడీపీ ట్రేడ్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెన్నా ఈశ్వరుడు, పొలం చిన్నా పాల్గొన్నారు.



రౌతులపూడి: ఇంటింటా ప్రచారంలో ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ

ఏడాదిలో ఎన్నో ఘన విజయాలు

తొండంగి, జూలై 15(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఏర్పడిన ఏడాదిలోనే ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు అమలు చేసి ఘనవిజయం సొంతం చేసుకుందని తుని ఎమ్మెల్యే యనమల దివ్య అన్నారు. మంగళవారం పీఈ చిన్నయ్యపాలెం గ్రామంలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే ఇంటింటి ప్రచారం నిర్వహించారు. త్వరలో రైతుల ఖాతాల్లో నగదు జమకానుందని, ఆగస్టు నెల నుంచి మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పిస్తామన్నారు. ఇప్పటికే తల్లికి వందనం అమలు చేసి ఇచ్చిన హామీని నిలుపుకున్నామన్నారు. కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నేతలు సుర్ల లోవరాజు. యనమల రాజేష్, కొయ్యా శ్రీను మోతుకూరి వెంకటేష్, చింతంనీడి అబ్బాయి, నరహరిశెట్టి సూర్యప్రకాష్, వడ్డి రాంబాబు, అరిగెల నర్సింహమూర్తి, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

పార్టీలో పలువురి చేరిక: పీఈ చిన్నయ్యపాలెం గ్రామానికి చెందిన పలువురు మంగళవారం ఎమ్మెల్యే యనమల దివ్య సమక్షంలో తెలుగుదేశం పార్టీలో చేరారు. వీరికి దివ్య పార్టీ కండవాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. నరహరి శెట్టి సూర్యప్రకాష్, వడ్డి రాంబాబు, తంగెళ్ళ శ్రీను ఆధ్వర్యంలో మాజీ సర్పంచ్ ములికి రాంబాబు, చిట్టి బాబు, రాయి రాజు, పీతల గంగ, లోవకుమారి, సీకోలు గంగరాజు, బుల్లెమ్మ తదితరులు టీడీపీలో చేరారు.



తొండంగి: పీఈ చిన్నయ్యపాలెంలో ఇంటింటా ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే యనమల దివ్య

పేదల సంక్షేమమే లక్ష్యం

ఏలేశ్వరం, జూలై 15(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అర్హులైన పేదలందరికీ సంక్షేమ పథకాలు అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం కృషి పని చేస్తోందని ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి అన్నా రు. మంగళవారం మండలంలోని లింగంపర్తి గ్రామంలో ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరించి, స్థానికుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. జ్యోతుల పెదబాబు, నూకతాటి ఈశ్వరుడు, ధనేకుల భద్రం తదితరులు పాల్గొన్నారు.

రహదారిపై చెల్లాచెదురుగా మెటల్

● మెటల్ తరలిస్తున్న క్వారీ లారీలు

● రహదారిపై పడుతున్న మెటల్

● ప్రమాదాలకు గురవుతున్న వాహనదారులు



మార్కెట్ సెంటర్‌లో చెల్లాచెదురుగా క్వారీ మెటల్

రౌతులపూడి, జూలై 15(ఆంధ్రజ్యోతి): రౌతులపూడి మార్కెట్ సెంటర్‌లో రహదారిపై నల్లమెటల్ చెల్లాచెదురుగా పడింది. దీంతో వాహనదారులు, బాటసారులు ఇబ్బందులు పడుతున్నారు. రౌతులపూడి గ్రామస్తులతో పాటు బంగారయ్యపేట, శృంగవరం గ్రామాల ప్రజలు కూరగాయలు కొనుగోలు కోసం, రైతులు పండించిన పంటలను అమ్మేందుకు రౌతులపూడి మార్కెట్ వస్తారు. రహదారిపై నల్లమెటల్ చెల్లాచెదురుగా పడి ఉండటంతో ఇబ్బందులు పడుతున్నారు. వాహనాదారులు అదుపుతప్పి కింద పడుతున్నారు. ఎస్.పైడిపాల, మల్లంపేట, ఉప్పంపాలెం, మూలగపూడి గ్రామాల నుంచి కాకినాడ, తొండంగి తదితర గ్రామాలకు నల్ల మెటల్‌ను భారీ వాహనాల్లో తరలిస్తున్నారు. నిబంధనలు పాటించకుండా పరిమితికి మించి ఓవర్ లోడ్‌తో నల్లమెటల్ తరలిస్తున్నారు. కనీసం మెటల్ తరలించే సమయంలో బరకాలు కూడా కప్పకపోవ డంతో వాహనాలు అతివేగంగా వెళ్లడంతో మెటల్ రహదారిపై పడుతోంది. ఇప్పటికైనా సంబంధితాధికారులు స్పందించి నిబంధనలు పాటించని వాహనాలపై చర్యలు తీసుకోవాలని వాహనదారులు, ప్రజలు కోరుచున్నారు.

ఆశ్రమానికి ఫ్యాన్లు వితరణ



ఏలేశ్వరం, జూలై 15(ఆంధ్రజ్యోతి): పట్టణంలో స్వామి దయానంద సరస్వతీ సేవా ఆశ్రమానికి మద్దుల స్వరూప్ పలు రకాల సామగ్రి అందజేశారు. మంగళవారం హెల్పింగ్ యూత్ నేతృత్వంలో స్వరూప్ కుమారుడు రుత్విక్ మెదటి పుట్టిన రోజు పురస్కరించుకుని అనాథ ఆశ్రమానికి సీలింగ్ ఫ్యాన్, కుక్కరు, 10 చాపలు అందిం చారు. వంకాయల వెంకటశెట్టి, దంగేటి మురళీ కృష్ణ, యూత్ సభ్యులు ఆలీషా, రాంలాల్,అప్పాజీ, ఆలీ, దుర్గ పాల్గొన్నారు.

రైతులు ఆధునిక వ్యవసాయ పద్ధతులు పాటించాలి

వ్యవసాయాధికారి చంద్రశేఖర్



బిళ్లనందూరులో పొలంబడి కార్యక్రమం నిర్వహిస్తున్న దృశ్యం

కోటనందూరు, జూలై 15(ఆంధ్రజ్యోతి): రైతులు ఆధునిక వ్యవసాయ పద్ధతులు అవలంబించాలని వ్యవసాయాధికారి కె.చంద్రశేఖర్ అన్నారు. మంగళవారం ఎస్.ఆర్.పేట, బిళ్లనందూరు గ్రామాల్లో పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం ఖరీఫ్ సీజన్ ప్రారంభమవుతున్న దృష్ట్యా రైతులందరూ విత్తన శుద్ధి చేయాలన్నారు. దీనివల్ల తెగుళ్ల బెడద తగ్గుతుందన్నారు. ప్రస్తుతం వర్షాభావ పరిస్థితులు నెలకొన్న దృష్ట్యా ఆకుమడులు విషయంలో తొందర పడవద్దన్నారు. కార్యక్రమంలో ఏఈవో జగ్గప్పరావు, సురేష్, బైలపూడి శ్రీరామమూర్తి పాల్గొన్నారు.